31 నుంచి అరకు ఉత్సవ్

అరకులోయ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నిర్వహించే అరకు చలి ఉత్సవ్‌పై జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ మంగళవారం అరకులోయలోని హరిత వేలీ రిసార్టులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. 31న మారథాన్ నిర్వహిస్తామన్నారు. ఉత్సవ్‌లో భాగంగా తొలిసారిగా హెలికాప్టర్ రైడ్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఉత్సవ్‌కు సంబంధించి డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు.

సమస్యల పరిష్కారమే అజెండా...

'ఆంధ్రజ్యోతి' మహత్తర కార్యక్రమం

ప్రజల వద్దకు ప్రజా ప్రతినిధులు, అధికారులు

- జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమల నగర్‌లో 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమం
- సమస్యలు నేరుగా చెప్పుకునే అవకాశం
- అక్కడికక్కడే అధికారుల వివరణలు
- కొన్నింటి పరిష్కారానికి వెంటనే హామీ
- మిగిలిన వాటికి త్వరలో పరిష్కారం చూపుతామని సభాముఖంగా ప్రకటన
- ఆంధ్రజ్యోతి చొరవకు స్థానికుల ప్రశంసలు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):
ప్రజలు తమ సమస్యలను ప్రత్యక్షంగా ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లేందుకు 'ఆంధ్రజ్యోతి' మంగళవారం గాజువాక నియోజకవర్గంలోని 87వ వార్డు పరిధిలో గల తిరుమల నగర్‌లో నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ జరిగిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ బొండా జగన్, జీవీఎంసీ జోన్-5 సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, జోన్-5 ఈఈ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, నీటి సరఫరా విభాగం ఏఈ కేదారినాథ్, ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ట్రాఫిక్ మేనేజర్ కృపాకరరావు, ఏపీఈపీడీసీఎల్ ఏఈ వీర్రాజు, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, ఇతర అధికారులు హాజరయ్యారు. తిరుమల నగర్‌తోపాటు 87వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల ప్రజలు హాజరై తాము దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలకు సంబంధిత అధికారులు వివరణ ఇవ్వడమే కాకుండా కొన్నింటి పరిష్కారానికి అక్కడికక్కడే హామీ ఇచ్చారు.

ముంపు సమస్య

తిరుమలనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ జనరల్ సెక్రటరీ ఎం.పరమానందం మాట్లాడుతూ తమ కాలనీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతోపాటు ఎగువన ఉన్న ఆటోనగర్ నుంచి వచ్చే డ్రైనేజీకి తమ కాలనీ తర్వాత అవుట్‌లెట్ లేకపోవడం వల్ల వర్షాలు కురిస్తే కాలనీ మొత్తం నీట మునిగిపోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. దీనికి జీవీఎంసీ జోన్-5 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నారాయణ సమాధానం ఇస్తూ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి తగిన

... మిగతా 4వ పేజీలో





87వ వార్డు పరిధిలోని తిరుమల నగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం ఉదయం నిర్వహించిన 'అక్షరం అండగా, పరిష్కారమే అజెండాగా...' కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ బొండా జగన్. చిత్రంలో జీవీఎంసీ జోన్-5 సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, జోన్-5 ఈఈ నారాయణ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, నీటి సరఫరా విభాగం ఏఈ కేదారినాథ్, ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ట్రాఫిక్ మేనేజర్ కృపాకరరావు, ఏపీఈపీడీసీఎల్ ఏఈ వీర్రాజు, దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు, 'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు, బ్యూరో ఇన్‌చార్జి వై.శ్రీనివాసరావు ఉన్నారు.




కార్యక్రమానికి హాజరైన తిరుమల నగర్, సిద్ధార్థనగర్, వడ్లపూడి ప్రాంతవాసులు

సమస్యలు, సమాధానాలు 6వ పేజీలో

స్మార్ట్ వార్డుగా తయారుచేసేందుకు కృషి

- బొండా జగన్, 87వ వార్డు కార్పొరేటర్



ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించడంతోపాటు మెరుగైన ఆరోగ్యకరమైన జీవనం కొనసాగించే వాతావరణాన్ని కల్పించడం ద్వారా 87వ వార్డును స్మార్ట్ వార్డుగా తయారుచేస్తాను. ఎంవీవీ అండ్ ఎంకే అపార్టుమెంట్ నుంచి వడ్లపూడి జంక్షన్ వరకు ప్రధాన రహదారి విస్తరణ, డ్రైనేజీ నిర్మాణం చేపడతాను. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించి వ్యాపారం చేసుకుంటున్న వారికి రైతుబజార్‌లో ఖాళీగా ఉన్న దుకాణాలను కేటాయించేందుకు చర్యలు తీసుకుంటాను. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో జీవీఎంసీ, ఏపీఐఐసీ అధికారులను సమన్వయం చేసుకుని ప్రజల సమస్యలను పరిష్కరిస్తాను. వార్డులో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మిస్తాను. వివిధ శాఖలకు చెందిన అధికారులను ఒకచోటకు తీసుకువచ్చి వార్డు ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు అవకాశం కల్పించిన 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు.

'ఆంధ్రజ్యోతి' చొరవ అభినందనీయం

- శ్రీలక్ష్మి, తిరుమలనగర్



ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చూపిస్తున్న చొరవ అభినందనీయం. దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి 'ఆంధ్రజ్యోతి' ఈరోజు మా ప్రాంతంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా కార్యక్రమం నిర్వహించడం, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులను తీసుకురావడం ఆనందంగా ఉంది. తిరుమలనగర్ తరఫున ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు.

నాలుగేళ్లుగా నాన్చుడు...

బంగ్లాదేశ్ నౌకపై ఎటూ తేల్చని అధికారులు

- 2020లో తీరానికి కొట్టుకువచ్చిన నౌక
- రెస్టారెంట్, ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమాల నిర్వహణకు అనువుగా తీర్చిదిద్దాలని పర్యాటక శాఖ యత్నం
- ఇప్పటికీ కొలిక్కిరాని వైనం
- సీఆర్‌జెడ్ అనుమతుల కోసం ఎదురుచూపులు?




నాలుగేళ్లుగా నీటిలో నానుతున్న బంగ్లాదేశ్ నౌక

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

బంగ్లాదేశ్‌కు చెందిన నౌక 'ఎంవీ మా' విశాఖపట్నం పోర్టు యాంకరేజి నుంచి తెన్నేటి పార్కు తీరానికి కొట్టుకువచ్చి నాలుగేళ్లు దాటిపోయింది. 2020 అక్టోబరు 11న అర్ధరాత్రి వీచిన బలమైన తుఫాన్ గాలులకు సముద్రం మధ్య నుంచి తీరానికి కొట్టుకు వచ్చి రాళ్ల మధ్య చిక్కుకుపోయింది. దీనిని వెనక్కి తీసుకువెళ్లాలని యాజమాన్యం యత్నించి విఫలమై అక్కడే వదిలేసింది. అందులో ఇంధనం దగ్గర నుంచి విలువైన యంత్ర సామగ్రినంతా తీసుకుపోయి కేవలం నౌకను మాత్రం విడిచిపెట్టింది. ఇలా పనికి రాని నౌకలను సముద్రంలో వదిలేయడం నిబంధనలకు విరుద్ధం. సముద్ర పర్యావరణం దెబ్బతింటుంది. తుక్కుగా మార్చి తరలించాల్సి ఉంది. కానీ ఈ నౌక విషయంలో మొదటి నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక ఆసక్తి ప్రదర్శిస్తూ వచ్చింది. దాంతో పోర్టు అధికారులు దాని జోలికి రాలేదు.

విశాఖలో నేవీ సేవల నుంచి విరమించిన సబ్‌మెరైన్, యుద్ధ విమానం, హెలికాప్టర్ వంటి వాటిని మ్యూజియాలుగా మలిచిన నేపథ్యంలో ఈ నౌకను కూడా పర్యాటకంగా ఉపయోగించుకోవాలని భావించారు. దానిని అక్కడే ఉంచి, అందులో రెస్టారెంట్, ఎంటర్‌టెయిన్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రత్యేక ఆకర్షణగా ఉంటుందని ప్రతిపాదించారు. మధ్యవర్తిగా గిల్‌మెన్ అనే సంస్థ రంగంలోకి

... మిగతా 4వ పేజీలో



నాగచైతన్య సందడి

యంగ్ హీరో అక్కినేని నాగచైతన్య మంగళవారం నగరంలో సందడి చేశారు. నగరంలోని రామాటాకీస్‌లో 'తండేల్' సినిమా ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్ర సమర్పకుడు అల్లు అరవింద్, రచయిత కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ సత్య, పాల్గొన్నారు.

-వివరాలు మెయిన్‌లో

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

- ఆరు నెలలుగా ఇబ్బంది
- సెప్టెంబరు నుంచి ప్రతి నెలా మూడో వంతు మాత్రమే చెల్లింపు
- డిసెంబరు నెల జీతం పూర్తిగా పెండింగ్
- మారని ఉన్నతాధికారుల తీరు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఉద్యోగులను వేధించడమే లక్ష్యమన్నట్టు స్టీల్‌ప్లాంటు ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని 110 శాతం ఉత్పత్తి సాధిస్తుంటే వారికి జీతాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. కేంద్రం ఉదారంగా రూ.11,440 కోట్ల సాయం చేసినా దానిని మనసారా ఉద్యోగులు అభినందించే పరిస్థితులు కల్పించడం లేదు. అనుమానాలు కలిగేలా ప్రవర్తిస్తున్నారు.

ఉక్కు ఉద్యోగులకు గత ఆరు నెలలుగా సరిగ్గా ఇవ్వడం లేదు. సెప్టెంబరు నెల జీతాలు 50 శాతం, అక్టోబరులో 35 శాతం, నవంబరులో 65 శాతం, డిసెంబరుకు సంబంధించి 100 శాతం ఇవ్వాల్సి ఉంది. ఇంకో రెండు రోజులు ఆగితే జనవరి నెల జీతం 100 శాతం ఇవ్వాల్సి ఉంటుంది. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే ఉద్యోగులు చెప్పిన మాట వినే పరిస్థితులు ఉండవు. అయినా ఇక్కడ ఉద్యోగులు భవిష్యత్తుపై ఆశతో పనిచేస్తున్నారు. కానీ యాజమాన్యం

... మిగతా 4వ పేజీలో

కేంద్ర ఉక్కు శాఖా మంత్రి రాక రేపు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):



కేంద్ర ఉక్కుశాఖా మంత్రి హెచ్‌డీ కుమరస్వామి గురువారం స్టీల్‌ప్లాంటుకు రానున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ మంత్రి స్టీల్‌ప్లాంటులో పర్యటించనున్నారు. కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించిన తరువాత మంత్రి పర్యటనకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. గతంలో ఒకసారి ప్లాంటులో పర్యటించిన కేంద్రమంత్రికి ప్రైవేటీకరణ చేయరాదని పోరాట కమిటీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. ఈసారి పర్యటనలో ప్రైవేటీకరణ చేయబోమని, ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని మంత్రి ప్రకటన చేయాలని కార్మిక వర్గం కోరుతోంది.

'ఉక్కు' పోరాట కమిటీలో విభేదాలు

- దీక్షా శిబిరం కొనసాగింపుపై వాగ్వాదం
- అర్ధాంతరంగా ముగిసిన సమావేశం

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి):
విశాఖ స్టీల్‌ప్లాంటు పోరాట కమిటీ సమావేశంలో తీవ్రస్థాయిలో విభేదాలు రేగాయి. స్టీల్‌ప్లాంటు టౌన్‌షిప్‌లో సోమవారం రాత్రి జరిగిన కమిటీ సమావేశంలో ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగారు. స్టీల్‌ప్లాంటుకు కేంద్రం భారీ ప్యాకేజీ ప్రకటించిన దృష్ట్యా కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరాన్ని ఎత్తివేయాలని కొంతమంది నాయకులు ప్రతిపాదించారు. భవిష్యత్తులో ప్లాంటు ఉన్నత స్థితికి చేరుకునేందుకు అందరి సహకారంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. దీనిపై కొందరు నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకున్నట్టు ప్రకటిస్తే తప్ప శిబిరాన్ని తొలగించడం సరికాదన్నారు. దీక్షలను కొనసాగించాల్సిందేనని పట్టుబట్టారు. ఈ విషయంలో కొన్ని యూనియన్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఒకానొక దశలో ఒకరిపై ఒకరు వ్యక్తిగత దూషణలకు దిగినట్టు సమాచారం. ఈ గందరగోళం మధ్య చివరకు ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే పోరాట కమిటీ సమావేశాన్ని ముగించారు.

రైల్వే జోన్ పనుల్లో జాప్యం!

- ప్రధాన కార్యాలయ నిర్మాణానికి 20 రోజుల క్రితం ప్రధాని శంకుస్థాపన
- పనుల ప్రారంభానికి కానరాని ఏర్పాట్లు
- వాల్తేరు డివిజన్ కొనసాగింపుపై కానరాని స్పష్టత
- ఎంపీలు ప్రశ్నిస్తేనే కదలిక



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో కొత్త రైల్వే జోన్ కార్యాలయ నిర్మాణానికి ప్రధాని నరేంద్ర మోద శంకుస్థాపన చేసి ఇరవై రోజులైపోయింది. ఇప్పటివరకూ ఒక్క ఇటుక కూడా వేయలేదు. అటు చూస్తే రాయగడలో కొత్త డివిజన్‌కు డీఆర్‌ఎంను నియమించడంతో...ఆయన బాధ్యతలు చేపట్టి పనులు పరుగులు తీయిస్తున్నారు. ఇక్కడ చూస్తే వాల్తేరు డివిజన్‌ను కొనసాగిస్తారా?, లేదా?...అనే విషయంపై స్పష్టత ఇవ్వడం లేదు. ఏడాదికి రూ.పది వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చే వాల్తేరు డివిజన్‌ను రెండు నెలల నుంచి పూర్తిస్థాయి డీఆర్‌ఎం లేకుండా ఇన్‌చార్జితో నడుపుతున్నారు. వాల్తేరు డివిజన్ నుంచి కొంత భాగం రాయగడలో చేరింది. మిగిలిన వాల్తేరు డివిజన్ సరిహద్దులు ఏమిటో స్పష్టత లేదు. పోస్టుల కేటాయింపు, ఉద్యోగుల సర్దుబాటు, ఆస్తుల పంపకాలు వంటి అనేక అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవలసి ఉంది.

ఇంతకీ కార్యాలయం ఎక్కడ?

విశాఖలో రైల్వే జోన్ కార్యాలయం ఎక్కడ అనే దానిపైనా రైల్వే వర్గాలకు అనుమానాలు ఉన్నాయి. ప్రస్తుతం అధికారులు చూపిస్తున్న బిల్డింగ్ డిజైన్లు అన్నీ డీఆర్‌ఎం కార్యాలయం వెనుక గల వైర్లెస్ కాలనీలో జోనల్ కార్యాలయం నిర్మాణానికి రూపొందించినవి. కేవలం 12 ఎకరాల నిర్మాణం కోసం అలా డిజైన్ చేశారు. అయితే జీవీఎంసీ ముడసర్లోవలో 52 ఎకరాలు ఇచ్చింది. ఆ భూమి కోసమే జోనల్ కార్యాలయం శంకుస్థాపన వాయిదా పడిందని ప్రచారం చేశారు. అదే నిజమైతే భవనాల డిజైన్లు మారాల్సి

... మిగతా 4వ పేజీలో

వైభవంగా సిరి సింహాద్రినాథుల

నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సిరి సింహాద్రినాథుల ఆర్జిత నిత్యకల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కంకణధారణ, యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేదమంత్రోచ్చారణలు, సన్నాయి వాయిద్యాల నడుమ జీలకర్ర బెల్లం, మాంగల్యధారణలు చేసి అక్షితారోపణలు గావించారు. స్వామివారికి మంతరపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కొమ్మాది, జనవరి28 (ఆంధ్రజ్యోతి) : మారికవలస సబ్‌స్టేషన్ 11 కేవీ మారికవలస ఇండస్ట్రియల్ ఫీడర్, మారికవలస 11 కేవీ జె.కె లే అవుట్ ఫీడర్ మరమ్మత్తులు చేపడుతుండడతో బుధవారం కొన్ని ప్రాంతాలకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు కొమ్మాది ఎలక్ట్రికల్ ఎఈ నరేష్ తెలిపారు. మారికవలస జంక్షన్, మారికవలస, బోరవానిపాలెం, మారికవలస జెఎన్‌ఎఎన్‌యూఆర్‌ఎం కాలనీ, బోరవానిపాలెం, డ్రైవర్స్‌కాలనీ, జేకే లే అవుట్, కొత్తపరదేశిపాలెం, పాత పరదేశిపాలెం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అప్పన్న నిత్యాన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి నగరానికి చెందిన కలిదిండి హేమసాయి రమణలక్ష్మీ రూ.లక్ష విరాళంగా సమర్పించారు. నగదు రూపంలో రూ.1,01,116 లను అన్నప్రసాద విభాగర పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కుమార్‌కు మంగళవారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం దాత కుటుంబ సభ్యులకు అంతరాలయంలో మూలవిరాట్ దర్శనం కలిపించి వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు: డీఈవో



విద్యార్థినికి స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డి.ఇ.ఓ. ప్రేమ్‌కుమార్

కొమ్మాది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని డి.ఇ.ఒ. ఎన్.ప్రేమ్‌కుమార్ అన్నారు. మంగళవారం చంద్రంపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 799 మందికి దివిస్ సంస్థ స్టడీ మెటీరియల్‌ను అందజేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. దివిస్ సి.ఎస్.ఆర్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ విద్యార్థులకు పదునుపెట్టే ఆయుధంలాంటిది స్టడీ మెటీరియల్ అని, దీన్ని ఉపయోగించుకుంటే అలవోకగా విజయం సాధించవచ్చని అన్నారు. ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి, ఉపాధ్యాయులు సోమయాజులు, కోటాన శ్రీను, దాసరినాగేశ్వరరావు, వై.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

గీతంలో 200 మంది విద్యార్థుల రక్తదానం

సాగర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ బుధవారం నుంచి నిర్వహిస్తున్న ఎక్సలెన్స్ మీట్ (జెమ్)లో భాగంగా మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఎన్‌టీఆర్ బ్లడ్‌బ్యాంక్, జిమ్‌సర్ బ్లడ్‌బ్యాంక్ నిపుణులు హాజరై విద్యార్థుల నుంచి రక్తాన్ని సేకరించారు. ఈ కార్యక్రమాన్ని గీతం బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్ పి.షీలా ప్రారంభించారు. కార్యక్రమంలో జెమ్ కన్వీనర్ డాక్టర్ బి.కృష్ణకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ షేక్ సంషుద్దీన్, ఎస్.ఎస్.మిశ్ర పాల్గొన్నారు.

పేదల ఆకలి తీరుస్తున్న అన్న క్యాంటీన్లు

భీమునిపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడంలో అన్నా క్యాంటీన్లు విజయవంతంగా నడుస్తున్నాయని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మంగళవారం ఆయన పలువురు పార్టీ నాయకులతో చిన్నబజారులోని అన్నా క్యాంటీన్‌లో భోజనం ఆరగించారు. భోజన పదార్థాలు రుచిగా ఉన్నాయని, పేదలు కడుపు నిండా తింటున్నారని కొనియాడారు. పేదల ప్రజల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం ఎక్కడా రాజీపడడం లేదన్నారు.

చుక్కలు చూపిస్తున్న భూములు

- మధురవాడలో తీరని సమస్యగా 22ఏ ల్యాండ్స్
- రెవెన్యూ రికార్డులో డాట్ భూములు ప్రస్తావన
- రిజిస్ట్రేషన్‌కు అనుమతించని అధికారులు
- భూముల క్రయవిక్రయాలు నిర్వహించలేని పరిస్థితి
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు



పరదేశిపాలెంలో అమ్మకానికి వీలు లేకుండా పోయిన భూమి

మధురవాడ, జనవరి 21 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ పరిసరాల్లోని పలు ప్రాంతాలకు చెందిన రెవెన్యూ రికార్డుల్లో ఉన్న 22 ఎ భూములు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంతో పాటు రెవెన్యూ కార్యాలయాల్లో కూడా మధురవాడ పరిసరాలలోని కొన్ని భూములు రికార్డుల్లో ఎర్రసిరాతో రెండు చుక్కలు మార్కు చేసి ఉంటాయి. ఈ చుక్కల మార్కులు ఉంటే వాటిని రిజిస్ట్రేషన్ చేయడానికి అధికారులు అనుమతించరు. కొంతమంది జిరాయితీ భూములు కూడా 22 ఎ పరిధిలో చూపించడంతో గత కొన్నేళ్ళుగా మధురవాడ, పోతినమల్లయ్యపాలెం, పరదేశిపాలెం, కొమ్మాది, ఎండాడ, రుషికొండ తదితర ప్రాంతాల ప్రజల క్రయవిక్రయాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తమ భూములను 22 ఎ పరిధి నుంచి తప్పించాలని గత కొన్నేళ్ళుగా రెవెన్యూ సదస్సులు, ఆర్డీవో, కలెక్టరు కార్యాలయం, మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఆర్జీలు ఇచ్చినా సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదిలావుండగా కూటమి ప్రభుత్వం కూడా 22ఏ భూములపై వస్తున్న ఆర్జీలు పరిశీలించి, వాటిలో అర్హతలున్న సర్వే నంబర్లలో చుక్కలను తొలగించే యోచనలో ఉందని వినిపిస్తోంది. ఈ ప్రక్రియ ఎప్పుడు ప్రారంభమవుతుందోనని పలువురు వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు.

అంబేడ్కర్ పేరు పలికే అర్హత కాంగ్రెస్‌కు లేదు

- బీజేపీ సీనియర్ నేత చక్రవర్తి



మాట్లాడుతున్న చక్రవర్తి, వేదికపై నాగరాజు తదితరులు

మధురవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్‌కు భారత రాజ్యాగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరు పలికే అర్హత లేదని భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకుడు కేఎస్పీ చక్రవర్తి అన్నారు. మధురవాడలో మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని రాసిన అంబేడ్కర్‌ను పార్లమెంటుకు రానీయకుండా కాంగ్రెస్ పార్టీ అభ్యరులను నిలబెట్టి ఆయనను అవమానించిందన్నారు. అలాంటి పార్టీకి అంబేడ్కర్ పేరు ఉచ్ఛరించే అర్హత లేదన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్ర, ఆయన పట్ల బీజేపీ దృక్పథం ప్రజలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో దేశవ్యాప్తంగా సంవిధాన్ గౌరవ్ అభియాన్ సమావేశాలు నిర్వహిస్తున్నట్టు చక్రవర్తి పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాగరాజు, కేశవ్‌కాంత్, దిలీప్ వర్మ, రామ్మోహన్, శ్రీనివాస్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల దాతృత్వం



మధురవాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో సేవా భావం పెంపొందించాలని ప్రజ్ఞ విద్యా సంస్థల అధినేత పిళ్లా విజయకుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రజ్ఞ ప్లే స్కూల్ పిల్లలు తమ కిడ్డీ బ్యాంకులో దాచుకున్న వృద్ధులకు చిన్నారుల అందించిన పొదుపు సొమ్మును నిత్యావసర సామగ్రి మధురవాడలో ఉన్న వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసర సరకులు ను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా చిన్నారులను ప్లేస్కూల్ నిర్వాహకులు, వృద్ధులు ఆశీర్వదించారు.

గెజిటెడ్ అధ్యాపకుల జిల్లా సంఘం అధ్యక్షుడిగా విష్ణుమూర్తి



విష్ణుమూర్తిని సన్మానిస్తున్న అధ్యాపకులు

భీమునిపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల విశాఖ జిల్లా సంఘం అధ్యక్షుడిగా భీమిలి ప్రభుత్వ ఎస్వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చీడి విష్ణుమూర్తి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నగరంలో జరిగిన ఈ ఎన్నికలకు సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకుడు ఎంవీ రామకృష్ణ ఎన్నికల పర్యవేక్షణ అధికారిగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ గత మూడు పర్యాయాలుగా గెజిటెడ్ అధ్యాపకుల జిల్లా సంఘానికి అధ్యక్షులుగా ఆయనే ఎన్నిక కావడం విశేషమన్నారు. ఈ సందర్భంగా మంగళవారం భీమిలి కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆర్.మంజుల, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆయనను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు.

31న డీఈఐ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాక్షినగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక దయాల్‌నగర్‌లో ఉన్న దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ (డీఈఐ) వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహిస్తున్నట్టు డీఈఐ ఇన్‌చార్జి దక్షిణామూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ ప్రాంగణంలో పూర్వ, ప్రస్తుత విద్యార్థులు రూపొందించిన దుప్పట్లు, చీరలు, చిన్నారులు వేసుకునే దుస్తుల ప్రదర్శన, అమ్మకాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అమ్మకాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు కొనసాగుతాయన్నారు.

బంగారమ్మ ఆలయ వార్షికోత్సవం రేపు

ఎండాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఎండాడ దసపల్లా లే అవుట్‌లో కొలువుదీరిన బంగారమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహిస్తున్నట్టు బంగారమ్మ తల్లి దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు సభ్యులు, ఆలయ అర్చకులు పేర్కొన్నారు.

సనాతన విధానంలో అప్పన్న ఆలయ మరమ్మతులు

- పూణేకు చెందిన ఆధ్యాత్మిక సంస్థకు బాధ్యత అప్పగింత
- ఫిబ్రవరిలో పనులు ప్రారంభం



సింహాచలంలోని అప్పన్న దేవాలయం

సింహాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి కొలువై ఉన్నదేవాలయానికి సనాతన విధానంలో మరమ్మతులు చేసేందుకు పూణేకు చెందిన వెంకటేశ్వర చారిటబుల్ అండ్ రిలిజియస్ ట్రస్టుకు బాధ్యత అప్పగిస్తూ దేవదాయశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. ఈ సంస్థ ఇంతకు ముందు శ్రీకాళహస్తి దేవాలయంలో మరమ్మతులు చేపట్టిన అనుభవం ఉన్నందున అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. అప్పన్న ఆలయంలో రెండు దశాబ్దాలుగా వర్షపునీరు కారుతూ భక్తులకు అసౌకర్యంగా ఉండడంతో గత కార్యనిర్వహణాధికార్లు శాండ్ బ్లాస్టింగ్, తదితర పలు విధానంతో మరమ్మతులుచేయించారు. అయినప్పటికీ కొద్దిపాటి వర్షానికి కూడా ఆలయంలోపల తడిసి ముద్దవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఇదే అంశం పత్రికల్లో కథనాలు వెలువడటంతో అధికారులు ఎట్టకేలకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలనే యోచనతో తిరుపతికి చెందిన ఐజీటీ ఆచార్యలను రప్పించి, దేశ ఎపిగ్రఫీ విభాగపు అధికారి మునిరత్నం రెడ్డి మార్గదర్శకత్వంలో ఆలయాన్ని మూడు నెలల క్రితం పరిశీలించారు. వారు సమర్పించిన నివేదిక ఆధారంగా ఆలయ పైకప్పుపై కొంత తొలగించి సనాతన విధానంలో భాగంగా ఆఫ్రికా నుంచి ప్రత్యేకమైన మృత్తికను తీసుకువచ్చి దానిని నానబెట్టి తేనె, కరక్కాయ, తదితర కొన్ని మూలికల మిశ్రమాన్ని కలిపి పైకప్పు పై వేయటం ద్వారా వర్షపునీరు కారటాన్ని నిరోధించవచ్చని భావించారు. ఈ పని చేసేందుకు పూణేకు చెందిన ట్రస్టు అందుకయ్యే పూర్తిఖర్చును భరించనుందని, ఆ సంస్థకు దేవదాయశాఖ స్థపతి, ఇంజినీర్లు అందరూ సహకారం అందాల్సి ఉంటుంది. పనిని ఫిబ్రవరిలో ప్రారంభించి తొమ్మిది మాసాల వ్యవధిలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

విలువల పాఠాలు..మన ఇతిహాసాలు

ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు



చాగంటి కోటేశ్వరరావుకు నమస్కరిస్తున్న గాయత్రి డీన్ వెంకట్రావు

కొమ్మాది, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఓర్పుతో ఎంతటి పనిలోనైనా విజయం సాధించవచ్చని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు అన్నారు. గాయత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా మంగళవారం బాలకాండలోని విశ్వామిత్ర మహర్షి శ్రీరామునికి తెలియచేసిన కుశునాభ ఉపాఖ్యానం, విశ్వామిత్రుని వంశచరిత్ర, షణ్ముఖోత్పత్తి ఘట్టాలను వివరించారు. విశ్వామిత్రునికి, ఆయన అక్కకు ఉన్న అనుబంధం మానవీయ సంబంధాలకు గొప్ప ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. రామాయణ, భారతాది ఇతిహాసాలు కేవలం కథలు కాదని, నిజ జీవితంలో మనకు విలువలు, మానవీయ సంబంధాలు నేర్పే గొప్ప పాఠాలని అభివర్ణించారు. ప్రవచనాలలో అత్యంత శక్తివంతమైన షణ్ముఖోత్పత్తి సందర్భంగా ఆరుగురు కృతికల స్వరూపంగా ఆరుగురు సువాసినులు ప్రత్యేకమైన సుగంధ ద్రవ్యాలను కలిపిన ఆవుపాలను మేళతాళాలతో తీసుకువచ్చి సుబ్రహ్మణ్య స్వామికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం మంగళహారతి సమర్పించి స్వామికి పూజ చేసిన విభూతిని భక్తులకు అందించారు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీదేవాలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి ఇంజనీరింగ్ కళాశాల ప్లేస్‌మెంట్ డీన్ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

బస్సును తప్పించబోయి ఇద్దరు యువకులకు గాయాలు

ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్ద ప్రమాదం

ఎండాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బస్సును అధిగమించబోయి ద్విచక్రవాహనంపై వస్తున్న ఇద్దరు గాయపడినట్లు పీఎంపాలెం పోలీసులు తెలిపారు. విజయనగరం జిల్లా బాడంగి మండలానికి చెందిన అలజంగి ధనుంజయ ఆరిలోవలో నివాసం ఉంటూ ప్రభుత్వ కృష్ణా కళాశాలలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఆయన సోదరుడు యజ్వల ప్రదీప్‌తో కలిసి మధురవాడ నుంచి మద్దిలపాలెంకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఎండాడ సిగ్నల్ పాయింట్ వద్ద బస్సును అధిగమించబోయి ప్రమాదం బారిన పడి గాయాల పాలయ్యారు. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కేన్సర్‌లో మైటోకాండ్రియా పాత్రపై పరిశోధనలు



గీతంలో సత్కారం పొందుతున్న ప్రొఫెసర్ డేనీఆర్.వెల్

సాగర్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చిన్నపరిమాణం కలిగినప్పటికీ, శరీరంలో ఉండే మైటోకాండ్రియాను కణానికి శక్తిని అందించే పవర్‌హౌస్‌గా విశ్వసిస్తారని, అయితే కేన్సర్ వ్యాపించే అవకాశాన్ని నిర్ణయించడంలో మైటోకాండ్రియా కీలక సమాచారం పొంది ఉంటుందని తమ పరిశోధనలో వెల్లడైందని యూనివర్సిటీ ఆఫ్ కాన్సాస్ కేన్సర్ సెంటర్ (యు.ఎస్.ఎ) పరిశోధకుడు ప్రొఫెసర్ డేనీ ఆర్.వెల్ పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ సైన్స్ జీవశాస్త్ర విభాగం నిర్వహించిన కార్యక్రమంలో మంగళవారం ఆయన ప్రసంగించారు. కేన్సర్ కారక మరణాల్లో మెటాస్టాసిస్ అంటే కేన్సర్ వ్యాప్తి 90 శాతంపైగా కారణమవుతోందని, అయినప్పటికీ, దీన్ని పూర్తిస్థాయిలో అర్థం చేసుకోవడానికి ఇప్పటి వరకు ప్రపంచదేశాల్లో సరైన ప్రయత్నం జరగలేదని అభిప్రాయపడ్డారు. ఈ రంగంలో ఇటీవల జరిగిన పరిశోధనలను ఆయన ప్రస్తావించారు. రాబోయే రోజుల్లో వ్యక్తిగత వైద్య చికిత్సలకు మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ అధ్యయనాలు కేన్సర్ చికిత్సా విధానాలను మెరుగుపరిచే మార్గాన్ని సూచిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కె.ఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ అధిపతి ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాస్, అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

పంటలకు కత్తెర పురుగు



తాటితూరులో పొలంబడి నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

భీమునిపట్నం రూరల్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తాటితూరు గ్రామంలో మంగళవారం భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి శివకోమలి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో మొక్కజొన్న, రాగి, నువ్వులు, వరి పంటకు అక్కడక్కడ కత్తెర పురుగు ఉన్నట్లు గుర్తించామన్నారు. పురుగు తొలిదశలో ఉంటే 5 శాతం వేపగింజల కషాయం లేదా వేప నూనె 1500 పిపిఎం, 5 మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 3వ పేజీ తరువాయి

మాత్రం దారుణంగా ప్రవర్తిస్తోంది. జీతాల కోసం ఆందోళన చేస్తే షోకాజ్ నోటీసులు ఇస్తోంది. పెన్షనర్లకు పెన్షన్లు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో స్టీల్ సెక్రటరీ సందీప్ పాండ్రీ ఢిల్లీ నుంచి విశాఖపట్నం వచ్చారు. ఉద్యోగులను పిలిచి, వారిలో ధైర్యం నింపాల్సిన ఆయన వారితో మాట్లాడడానికే నిరాకరిస్తున్నారు. గురువారం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి వస్తున్నారు. ఆయన వచ్చినప్పుడు జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆందళన చేస్తారేమోననే భయంతో నవంబరు నెలకు సంబంధించిన బకాయి 65 శాతంలో 35 శాతం ఇప్పుడు చెల్లించారు. ఇంకా సెప్టెంబరు నెలకు సంబంధించి 50 శాతం, అక్టోబరు 50 శాతం, నవంబరులో మిగిలిన 30 శాతం, డిసెంబరు 100 శాతం జీతాలు రావలసి ఉంది. ఉద్యోగుల కడుపులు మాడ్చి, 100 శాతం ఉత్పత్తి సాధించాలని ఏ యాజమాన్యం అనుకోకూడదు. కానీ ఇక్కడ యాజమాన్యం విచిత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటోంది. దీనిపై మంత్రి, పెద్దలు అంతా ఆలోచించుకొని అందరినీ కలుపుకొని వెళ్లే విధంగా ప్రణాళిక తయారు చేసుకోవలసిన అవసరం ఉంది.

రైల్వే జోన్ పనుల్లో జాప్యం!

... 3వ పేజీ తరువాయి

ఉంది. కానీ ఇంతవరకూ వాటి గురించి ప్రస్తావన లేదు.

బడ్జెట్ సమావేశాలు

ఈ వారాంతంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు రైల్వేజోన్, వాల్తేరు డివిజన్ అంశం తప్పనిసరిగా మాట్లాడాల్సి ఉంది. శంకుస్థాపన అయిపోయింది కాబట్టి జోన్ వచ్చేసిందని సంబరపడాల్సిన పరిస్థితులు లేవు. జోన్ ప్రకటించిన ఐదేళ్లకు శంకుస్థాపన చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెట్టకపోతే పనులు పూర్తికాని పరిస్థితులు ఉన్నాయి. విశాఖలో జోన్ కార్యకలాపాలు ఇప్పటికిప్పుడు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు అందుబాటులో ఉన్నాయి. దీనికి అవసరమైన ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీని నియమించాలి. ఆ దిశగా ఎంపీలు ఒత్తిడి పెట్టాలి. అప్పుడే అనుకున్నవన్నీ సాధ్యమవుతాయి.

తాత్కాలిక సిబ్బంది అవసరం

చలసాని గాంధీ, మాజీ ప్రధాన కార్యదర్శి, తూర్పు కోస్తా రైల్వే శ్రామిక యూనియన్

రైల్వేజోన్‌కు నిధుల కేటాయింపుపై 25 మంది ఎంపీలు, 11 మంది రాజ్యసభ సభ్యులు ప్రశ్నించాలి. జోన్ కార్యాలయం నిలదొక్కుకునేంత వరకూ సికింద్రాబాద్ కార్యాలయం నుంచి తాత్కాలికంగానైనా పెద్ద సంఖ్యలో సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. రాయగడ డివిజన్‌కు ఇక్కడి నుంచి భారీగా ఉద్యోగులను తరలిస్తున్నారు. వీటన్నింటిపై ఎంపీలు చర్చించాలి. విశాఖకు అన్యాయం జరగకుండా చూడాలి.

నాలుగేళ్లుగా నాన్చుడు...

... 3వ పేజీ తరువాయి

దిగి యాజమాన్యంతో మాట్లాడి నౌకను తీసుకుంది. పర్యాటక శాఖకు అనుకూలంగా దానిని మార్చి ఇవ్వడానికి అంగీకరించింది. దీనిని కొంత భాగం మ్యూజియంగా, మరికొంత భాగం రెస్టారెంట్‌గా ఉపయోగించుకోవాలని ఒక అవగాహనకు వచ్చారు.

అటవీ శాఖ నుంచి భూమి

తెన్నేటి పార్కు తీరంలో చిక్కుకుపోయిన నౌకను వారాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శిస్తుంటారు. కొందరు తెన్నేటి పార్కు మెట్లు దిగి నౌక వద్దకు వెళుతుంటే...మరికొందరు పార్కు దాటి ముందుకు వెళ్లి జోడుగుళ్లపాలెం బీచ్ మీదుగా వెళుతున్నారు. రహదారి వేయాలని పర్యాటక శాఖ అధికారులు అనుకున్నారు. అదంతా అటవీ శాఖకు చెందినది కావడంతో సంప్రతింపులు జరిపి అనుమతి తీసుకున్నారు.

సీఆర్‌జెడ్ అనుమతి కోసం వెయిటింగ్

నౌక నిలిచిపోయిన ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి(సీఆర్‌జెడ్) పరిధిలో ఉంది. అక్కడ ఎటువంటి వ్యాపార కార్యక్రమాలు, నిర్మాణాలు చేపట్టాలనుకున్నా ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతి తీసుకోవాలి. అక్కడకు కూడా ఫైల్ పంపారు. నౌకను ఏ విధంగా ఉపయోగించాలనుకుంటున్నారు?, దాని వల్ల పర్యావరణ నష్టాలు ఏమిటి?, రెస్టారెంట్ పెడితే వ్యర్థాలు ఏమి చేస్తారు?...తదితర అంశాలను వివరించాల్సి ఉంది. పర్యాటక శాఖ అధికారులు చెప్పిన మాటలు విశ్వసనీయంగా ఉంటే బోర్డు అనుమతి ఇస్తుంది. లేదంటే తిరస్కరించే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా బోర్డుతో సంప్రతింపులు జరుపుతున్నారు. అక్కడ ఏమి జరిగిందో విశాఖ అధికారులకు తెలియదు. అడిగితే ఆ నౌకకు సంబంధించిన వ్యవహారాలన్నీ అమరావతి అధికారులు చూసుకుంటున్నారని చెప్పి తప్పించుకుంటున్నారు. అమరావతిలో అధికారులు ఎప్పటికప్పుడు మారిపోతున్నారు. ఇప్పుడు కూడా కొత్త అధికారులు వచ్చారు. వారైనా సీరియస్‌గా తీసుకొని ఈ నౌకకు అనుమతులు తీసుకువస్తారా? లేదంటే...అలాగే వదిలేస్తారా? అనేది వేచి చూడాలి.

సమస్యల పరిష్కారమే అజెండా...

... 3వ పేజీ తరువాయి

చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీఐఐసీతో చర్చించిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి డ్రైన్ మళ్లింపు లేదంటే కాలనీ తర్వాతఅవుట్‌లెట్‌కు కనెక్షన్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

డంపింగ్ యార్డుతో కాలుష్యం

అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.విశ్వేశ్వరరావు మాట్లాడుతూ తమ కాలనీకి అనుకుని ఖాళీగా ఉన్న ఏపీఐఐసీ భూమిలో పరిశ్రమలు వ్యర్థాలను పడేస్తుండడంతో డంపింగ్ యార్డుగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కళింగ నగర్‌కు చెందిన ఎం.అప్పయ్యమ్మ, తిరుమల నగర్‌కు చెందిన స్వాతి మాట్లాడుతూ అనధికార డంపింగ్‌యార్డులో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల వెలువడే దట్టమైన పొగ కారణంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సాయంత్రం నాలుగు దాటితే పిల్లలు బయటకు రాలేకపోతున్నారని, ఎన్నిసార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందన్నారు. దీనికి జోన్-5 సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ సమాధానం ఇస్తూ అనధికార డంపింగ్ యార్డు గురించి ఇటీవలే ఏపీఐఐసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. యార్డులో ఉన్న సగం వ్యర్థాలను ఇతర చోటకు తరలించారని, మిగిలిన వాటిని కూడా అక్కడకే తరలించేలా, ప్రహరీ గోడ నిర్మించేలా మరోసారి ఏపీఐఐసీ అధికారులపై ఒత్తిడి చేస్తామన్నారు.

కల్యాణ మండపాలు ఏవి

వడ్లపూడికి చెందిన కడుపుట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వడ్లపూడి, కణితి ప్రాంతాల్లో ఉన్న రెండు కల్యాణ మండపాలను గత ప్రభుత్వం వార్డు సచివాలయాలుగా మార్చేసిందని, ఎలాంటి శుభ కార్యక్రమాలు చేసుకోవాలనుకున్నా సరే ప్రైవేటు కల్యాణమండపాలకు భారీగా డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబజార్ నిర్మించినా వృథాగా ఉండిపోయినందున దానిని అందుబాటులోకి తేవాలని కోరారు. 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ దీనిపై స్పందిస్తూ, పాత మీసేవా భవనం శిథిలావస్థలో ఉన్నందున దాని స్థానంలో కొత్తగా వార్డు సచివాలయ భవనం నిర్మించాల్సిందిగా జీవీఎంసీ కమిషనర్, గాజువాక ఎమ్మెల్యేలను కోరామన్నారు. నిధులు రాగానే కొత్తభవనం నిర్మించి కల్యాణ మండపాలను ఖాళీ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

తిరుమల నగర్‌కు చెందిన దేవీ మాట్లాడుతూ తమ ప్రాంతానికి గతంలో బస్సు ఉండేదని అధికారులు రద్దు చేయడంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. అలాగే అనధికార డంపింగ్ యార్డును ఖాళీ చేసి అక్కడ సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఇందుకు ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ట్రాఫిక్ మేనేజర్ కృపావరరావు మాట్లాడుతూ తమకు లిఖితపూర్వకంగా వినతిపత్రం ఇస్తే రెండు రోజుల్లో బస్సు సర్వీసు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

ఆకతాయిల ఆగడాలు

దుగ్గపువానిపాలేనికి చెందిన డి.అప్పలనాయుడు, వడ్లపూడికి చెందినకుమార్ మాట్లాడుతూ తమ ప్రాంతంలోని పాఠశాల ప్రాంగణంలో రాత్రిపూట ఆకతాయిలు చేరి, మత్తు పదార్థాలు సేవిస్తున్నారని, స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. పోలీసులు నిఘా పెంచాలని కోరారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు స్పందిస్తూ ఇకపై రాత్రి గస్తీని పెంచడం ద్వారా ఆకతాయిల సమస్యకు అడ్డుకట్ట వేస్తామన్నారు.ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి వస్తే వెంటనే ఒక ఫోన్ చేస్తే ఐదు నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకుంటామని, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేస్తామన్నారు. కాలనీలో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, కాలనీ అసోసియేషన్‌లు చొరవ తీసుకోవాలని కోరారు.

వడ్లపూడికి చెందిన కె.రమణ మాట్లాడుతూ వడ్లపూడి ప్రధాన రహదారిని ఆక్రమించి దుకాణాలు పెట్టడం వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. జోన్-5 డీఈ నారాయణ స్పందిస్తూ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ సమీపంలో మద్యం దుకాణం!

వడ్లపూడికి చెందిన రాము మాట్లాడుతూ వడ్లపూడి బస్టాప్‌కు, వినాయక ఆలయానికి సమీపంలో మద్యం దుకాణం పెట్టడం వల్ల ప్రతి ఒక్కరూ తాగి వాహనాలను నడుపుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనికి సీఐ మల్లేశ్వరరావు సమాధానం ఇస్తూ ట్రాఫిక్ విభాగంతో కలిసి డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మందుబాబులపై కేసులు నమోదుచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీగణేష్‌నగర్‌లో 49/4లో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని, దానిని స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనానికి వినియోగించాలని ఆనంద్‌కుమార్ కోరారు. ఆ భూమిలో సర్వే చేసి ఆక్రమణలు ఉన్నట్టు తేలితే తొలగిస్తామని డిప్యూటీ తహసీల్దార్ హామీ ఇచ్చారు.

'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్‌డైరెక్టర్ కె.రామకృష్ణారావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, సర్క్యులేషన్ మేనేజర్ సత్యనారాయణ, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆర్.వెంకటరావు, అడ్వర్టైజ్‌మెంట్ డిపార్టుమెంట్ ప్రతినిధి వరహాలు, గాజువాక పీసీ ఇన్‌చార్జి నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆదాయం రూ.9.64 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

పెందుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపైనున్న వెంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 110 రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకల ద్వారా స్వామికి రూ.9,64,030 సమకూరింది. అధికారులు లెక్కింపును పర్యవేక్షించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

గోపాలపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా గోపాలపట్నం సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. శ్రీరామ్‌నగర్, ప్రశాంతినగర్, గోపాలపట్నం బంక్ ఏరియా, వుడా కాలనీ, టైలర్స్ కాలనీ, గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధర్మశ్రీని కలిసిన అదీప్‌రాజ్



ధర్మశ్రీని సత్కరిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి పార్లమెంటరీ వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మంగళవారం గాజువాకలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనకాపల్లి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పైల శ్రీనివాసరావు, కోటాన రాము, గొరపల్లి శ్రీనివాసరావు, చిరికి దేవుడు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు

ఎన్ఏడీజంక్షన్, జంక్షన్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎం.ఎన్.హరేంధరప్రసాద్‌ను కలెక్టరేట్‌లో మంగళవారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ కలిసి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా నగరంలోని పార్కులు అభివృద్ధికి, 52 వార్డు పరిధిలో ఎయిర్‌పోర్టు రహదారిని 30 అడుగుల నుంచి 60 అడుగుల విస్తరణపై చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 12,వంకాయలు (తెలుపు) 24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 46,బీరకాయలు 54, ఆనపకాయ 14,కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళ దుంపలు 20, అరటికాయ 7, మునక్కాడలు (కిలో) 110, అల్లం 44, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి 250, కొబ్బరికాయ 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ 28, చేమదుంపలు 42, చిలగడదుంపలు40, కంద 56, దేముడుచిక్కుడు 32, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100,ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు కిలో 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

దర్జాగా ప్రభుత్వ స్థలం ఆక్రమణ

- జెర్రిపోతులపాలెంలో దందా
- గతంలోనే అడ్డుకున్న అధికారులు
- కిందిస్థాయి సిబ్బంది సహకారంతో తాజాగా శ్లాబ్ నిర్మాణం
- ఆర్డీవో దృష్టికి ఆక్రమణ వ్యవహారం
- సర్వేచేసి, తొలగిస్తామన్న తహసీల్దార్



జెర్రిపోతుల పాలెంలోని ప్రభుత్వ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణం

పెందుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): :పెందుర్తి రెవెన్యూ మండలం జెర్రిపోతులపాలెంలో ప్రభుత్వ స్థలాలను తప్పుడు పత్రాలతో ఆక్రమించిన యథేచ్ఛగా పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. జెర్రిపోతులపాలెం సర్వే నంబరు 79/4లో 9.24 ఎకరాలు ప్రభుత్వ గయాళ్ భూమి ఉంది. మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ కోసం నాలుగు దశాబ్దాల కిందట రైతుల నుంచి డీ పట్టా (అతకుబడి) భూములు రెవెన్యూ అధికారులు సేకరించారు. భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా ఇదే సర్వే నంబరులో ఆరు ఎకరాలు లేఅవుట్ వేసి 50 మందికి 0.5 సెంట్లు చొప్పున ఇళ్ల పట్టాలు అందజేశారు. ఇందులో కొంత మంది రైతులు నిర్మాణాలు చేపట్టారు. మిగులు భూమిలో ఇటీవల పేదలకు పట్టాలు ఇచ్చారు. కొన్ని ఇళ్ల నిర్మాణం, పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాల నిర్మించారు. ఇందులో ఇంకా సుమారుగా 0.8 సెంట్లు ప్రభుత్వ భూమి మిగిలి ఉంది. కాలక్రమంలో సమీప భూములకు గిరాకీ పెరగడం, ఇళ్ల నిర్మాణాలు చేపట్టడంతో స్థలాల విలువ పెరిగింది. దీంతో మిగులు భూమిపై ఆక్రమణదారుల కన్నుపడింది. ఈ స్థలం పరిసర ప్రాంతంలో గజం స్థలం రూ.10వేలకు పైగా ఉంది. ఇదే అదనుగా కొంతమంది సిండికేట్‌గా మారి ఈ భూమిని కొట్టేసేందుకు పక్కా స్కెచ్‌తో ఆక్రమణలకు తెర తీశారు. ఇలా ఆక్రమించిన స్థలంలో ఓ మాజీ సర్పంచి భారీ నిర్మాణానికి సిద్ధమయ్యారు. ఈస్థలాన్ని ఆక్రమించిన అతడు ఇళ్లతో పాటు వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారని మాజీ సర్పంచ్ కోన శ్రీనివాసరావు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులో కేసు వేశారు. తాజాగా ఇక్కడి అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు అడ్డుకున్నప్పటికీ కింది స్థాయి సిబ్బంది సహకారంతోనే శ్లాబ్ వేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇటీవల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరైన ఆర్డీవో శ్రీలేఖ జెర్రిపోతులపాలెంలో ఆక్రమణపై ఆగ్రహం వ్యక్తం చేసి దీనిపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌ని ఆదేశించారు. కాగా సర్వే చేపట్టి పోలీసుల సహకారంతో అక్రమ నిర్మాణాలు తొలగిస్తామని తహసీల్దార్ ఈ సందర్భంగా వివరించారు.

'స్టీల్‌ప్లాంటును ఆదుకునేందుకు కేంద్రం విశేష కృషి'



మాట్లాడుతున్న బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం అన్ని విధాల అండగా ఉంటుందని, భారీ ప్యాకేజీ ప్రకటించిన ఘనత బీజేపీ ప్రభుత్వానికి దక్కుతుందని బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాక పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 30న స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి విచ్చేయనున్నారని, భారీగా ప్రజలు హాజరై స్వాగతం పలకాలన్నారు. విమానాశ్రయం, గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా భారీ ర్యాలీగా స్టీల్‌ప్లాంట్ వరకు ర్యాలీ చేయనున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రంగనాయకులు, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేంద్రమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఈ నెల 30న స్టీల్‌ప్లాంట్‌కు రానున్నందున ఆయనకు స్వాగతం పలకాలని గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కుమారస్వామి పర్యటన సందర్భంగా విమానాశ్రయం, గాజువాక, కూర్మన్నపాలెం మీదుగా స్టీల్‌ప్లాంటు వరకు ర్యాలీ చేస్తామన్నారు. ఈ సమావేశంలో దీనంకొండ కృష్ణంరాజు, గూటూరు శంకరరావు, నాగేశ్వరరావు, రంగనాయకులు, మనోహర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఉక్కు'కు సొంత గనుల కేటాయింపేదీ?

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు

కూర్మన్నపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షిస్తామని ప్రకటిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమకు సొంత గనుల కేటాయింపులో ఎందుకు తాత్సారం చూపిస్తున్నాయని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నరసింగరావు ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న జాతను ఆయన మంగళవారం కూర్మన్నపాలెం ఆర్చ్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా ప్రారంభం కాని ప్రైవేటు ఉక్కు కర్మాగారాలకు సొంత గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం తమ ఆధీనంలో నడుస్తున్న, ప్రభుత్వ రంగ సంస్థ విశాఖ స్టీల్‌ప్లాంటుకు నేటి వరకు సొంత గనులు సమకూర్చకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాంటు పరిరక్షణ కోసం ఎంతటి త్యాగాలకైనా తాము సిద్ధమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లోకనాథం, సీపీఎం కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ బి.గంగారాం, నాయకులు కె.ఎం.శ్రీనివాస్, జె.అయోధ్యరాం, వై.టి. దాసు, యు.రామస్వామి, డి.ఆదినారాయణ, పి.వి. రమణమూర్తి, దొమ్మేటి అప్పారావు, సన్యాసిరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ పెదమడక కొండపై వెలసిన సంతానలక్ష్మి, కల్యాణ లక్ష్మి, నూకాంబిక ఆలయం తృతీయ వార్షికోత్సవం మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు పూలు, నూతన వస్త్రాలతో అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సమితి సభ్యులు ఆలయంలో లలితా సహస్ర నామ పారాయణం పఠించారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బల్ల పైడిరాజు, ప్రతినిధులు బలిరెడ్డి తరుణ్‌సాయి, తాతకొండ వెంకటరావు, ఉదయ్‌భాస్కర్, కరణం లక్ష్మి, అప్పిరావు, బల్ల దేవి, రమణమ్మ, విజయకుమారి, దేవి, లక్ష్మి, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.



సుందరకాండ పారాయణం చేస్తున్న మహిళలు

మాసశివరాత్రి పూజలు...

అగనంపూడి: అగనంపూడి శ్రీఉమా మహేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ లింగాన్ని ప్రత్యేక పుష్పాలతో అలకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సాయంతో అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భక్తిగీతాలు, భజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సుబ్బారావు, లోవరాజు, సోమేశ్వరరావు, కరణం సన్నీ, అప్పలరాజు, పైడిరాజు, కొలిపాక అప్పారావు, బలిరెడ్డి సన్నీ, నరసింగరావు, వరహాలు, తదితరులు పాల్గొన్నారు.



అగనంపూడిలో భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

ముగిసిన సుందరకాండ పారాయణం

వేపగుంట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 98వ వార్డు భరత్‌నగర్ దరి శ్రీ గోపీజనవల్లభస్వామి ఆలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న సామూహిక సుందరాకాండ పారాయణం మంగళవారం ముగిసింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సుందరాకాండ పారాయణం భక్తిశ్రద్ధలతో ఆలపించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.

జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేషస్పందన లభించింది. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు కారుమూరి మహేశ్ ఆధ్వర్యంలో సభ్యులు అతిథులను ఘనంగా సత్కరించారు.

\- ఉక్కు టౌన్‌షిప్, ఆంధ్రజ్యోతి



ఘనంగా ఆర్టీవో కార్యాలయ వార్షికోత్సవం



ఆర్టీవో జయప్రకాశ్‌ను సత్కరిస్తున్న అగనంపూడి కూటమి నాయకులు

అగనంపూడి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక రవాణా శాఖ కార్యాలయం వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆర్టీవో జయప్రకాశ్ కేక్ కట్ చేసి, సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక కూటమి నేతలు ఆర్టీవోను సత్కరించారు. వాహనదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మోటూరి వెంకటరమణ, బండారు చందూరమేశ్, గల్లా రుద్రకుమార్, బి. సత్యనారాయణ, సింగిడి సింహాచలం, ఎంవీ ఇన్‌స్పెక్టర్ ఎన్. శ్రీనివాసరావు, ఏవో కృష్ణమోహన్, అసిస్టెంట్ ఎంవీ ఇన్‌స్పెక్టర్లు సౌజన్య, లలిత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల నుంచి రక్షణకు మాక్‌డ్రిల్ దోహదం

- విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్

గోపాలపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి విపత్తులు, ఆపత్కాల సమయాల్లో విపత్తు దళాలకు మాక్‌డ్రిల్ ఎంతో దోహదపడుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ రోణంకి కూర్మనాథ్ అన్నారు. విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ సంయుక్తంగా ఎన్డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్‌ను బుధవారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో టేబుల్ టాప్ ఎక్సర్ సైజ్‌లను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విమానాశ్రయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలో భారీ తుఫాన్‌లు సమర్థంగా ఎదుర్కొని ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించడానికి విపత్తు నిర్వహణ దళాలు తీసుకునే చర్యలను మాక్‌డ్రిల్ ద్వారా వివరించనున్నట్టు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ మాక్‌ఎక్సర్ సైజ్‌లో ఎన్డీఎంఏ, ఎస్డీఎంఏ, ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సివిల్ డిఫెన్స్, నేవీ, ఫైర్ సర్వీసెస్, పోలీస్ మెడికల్, పీఆర్ ఆర్డీ, ఆపదమిత్ర వలంటీర్లు పాల్గొన్నారు. లెఫ్టినెంట్ జనరల్ సయ్యద్ అటా హస్నైన్, మేజర్ జనరల్ ఏకే వర్మ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ డైరెక్టర్, తదితరులు పాల్గొన్నారు.



ఎన్డీఆర్ఎఫ్ దళం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు



బహుమతులు అందజేస్తున్న గంగవరం పోర్టు అధికారులు

గాజువాక, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అదానీ గంగవరం పోర్టు ఆధ్వర్యం లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గంగవరం మైదానంలో మంగళవా రం నిర్వహించిన పోటీల్లో గంగవరం, దిబ్బపాలెం, శ్రీనగర్ ప్రాంతాల 15జట్లు పాల్గొన్నాయి. విజేత జట్లకు పోర్టు అధికారులు బహుమతులందజేశారు. పోర్టు యాజమాన్యం సీఎస్ఆర్‌లో భాగంగా విద్య, వైద్యం, జీవనోపాధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు చెప్పారు. క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉందని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాగాలన్నారు.

'కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలి

పెదగంట్యాడ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం (ఇంటక్) నాయకులు మంగళవారం స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ధర్నా చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోనికి తీసుకోవాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, బోనస్ ఇవ్వాలని, నిర్వాసిత నిరుద్యోగులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, కాంట్రాక్ కార్మికులందరికీ సైట్ మెయింటెనెన్స్ అలవెన్సు ఇవ్వాలని నినాదాలు చేశారు. సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వంశీకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కొవిరి అవతారం, రమణమూర్తి, గొందేశి ప్రభాకరరెడ్డి, మంత్రి గోపీ నారాయణ, పీవీ నాగేష్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవాలి: సీఐ

పెదగంట్యాడ, జనవరి 28(ఆంధ్రజ్యోతి): శ్రీపెంటమాంబ ఆలయం, పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని న్యూపోర్టు శాంతిభద్రతల విభాగం సీఐ తోటాడ కామేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ వార్షికోత్సవాలు దగ్గర పడుతున్న నేపథ్యం మంగంళవారం ఆలయాన్ని ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ ఎస్ఐ గణపతి, ఏఎస్ఐ ఉమామహేశ్వరరావులను ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణా రెడ్డి, గొందేశి సత్యారావు, యెల్లేటి శ్రీనివాసరావు, ఆలయ ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ సత్కరించారు.

'సామాజిక కార్యక్రమాల్లో కోరమాండల్ ముందంజ'

మల్కాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో కోరమాండల్ ఎరువుల కర్మాగారం ప్రణాళికలను సిద్ధం చేసినట్టు సంస్థ డీజీఎం (హెచ్ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రిక్రియేషన్ క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక ప్రాంతంలో ప్రభుత్వ స్థలం చూపిస్తే రూ.కోటితో ఆస్పత్రి నిర్మించాలనే ఆలోచిస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులన్నీ ఈ ప్రాంతంలోనే వినియోగిస్తామన్నారు. విద్య, వైద్య అభివృద్ధితోపాటుసామాజిక భవన నిర్మాణాలు చేపడతామన్నారు. తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ (హెచ్ఆర్) కాకి శ్రీకాంత్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ నారాయణపాత్రుడు, డిప్యూటీ మేనేజర్ (సీఎస్ఆర్) వెంకటరమణ, సీఎస్ఆర్ ప్రతినిధి ధర్మాల వేణు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్: ఏడీసీపీ

మల్కాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనాలను నడిపితేనే ప్రమాదాల నివారణ సాధ్యమని అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీసు (ట్రాఫిక్) కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పోర్టు ఎగ్జామ్‌పార్కులో విశాఖపట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపకూడదన్నారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు చేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.బుచ్చిరాజు, మన్‌మోహన్, శ్రీనివాస్‌యాదవ్, హార్బర్ జోన్ ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ జి.అప్పారావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.అప్పలరాజు, పి. లక్ష్మీనారాయణ, కె.అర్జునరావు, కె. కాశీవిశ్వనాథ్, పీలా అప్పలరాజు, కె.సీతారామస్వామి పాల్గొన్నారు.

గ్రామాల్లో సందడిగా పొలం పిలుస్తోంది

పెందుర్తి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జెర్రిపోతులపాలెం, పినగాడి, నరవలో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. రైతులకు జీవన ఎరువుల ప్రాధాన్యత, పంటలో సమగ్ర సస్యరక్షణ, మేలైన సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. శ్రీలత, సరిత, గౌరీ, ఏడీఏ దుర్గాప్రసాద్, ఏవో రమణ, పాల్గొన్నారు.

ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలివ్వాలి

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించేలా యాజమన్యం చర్యలు తీసుకోవాలని ఇంటక్ సెక్రటరీ జనరల్ మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. మంగళవారం ప్లాంట్ టీటీఐ జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **KONDADA JYOTHI** (Old Name), W/o. Bondada Srinivasa Rao, R/o. 2-184, Kadali, Razole, Dr. B.R. Ambedkar Konaseema. Change my name from **KONDADA JYOTHI** (Old Name) to **BONDADA JYOTHI** (New Name). Henceforth I am being called as **BONDADA JYOTHI** (New Name) for all purposes.

AJV_231056

CHANGE OF NAME

★ I, **PEDAPATI JOSHI SUSMITHA** (Old Name), W/o. Nayani Sai Trinadh, R/o. 49-8-2/2/3, F.No.202, Ayyappu Reddy Res., Lalitha Nagar, Akkayyapalem, Visakhapatnam. Change my name from **PEDAPATI JOSHI SUSMITHA** (Old Name) to **PEDAPATI SUSHMITHA** (New Name). Henceforth I am being called as **PEDAPATI SUSHMITHA** (New Name) for all purposes.

AJV_231057

డాక్యుమెంటు పోయినది

సాకా హేమలత, డోర్ నెం. ఫ్లాట్ నెం.112, సౌభాగ్య రెసిడెన్సీ, స్టేషన్ రోడ్, యలమంచిలి-531055 అను నేను యలమంచిలి నుండి విశాఖపట్నం బస్సులో వెళ్తుండగా నా ఇంటి తాలూకా లింకు దస్తావేజు నెం. 6972/2015 పోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది నెంబరుకు తెలియజేయగలరు.

Cell: 70956 74633

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని, ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వక భేటీ



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలోని ఉండవల్లిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఆయన నివాసంలో విశాఖపట్నం ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ నగరంలో పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ఫిషింగ్ హార్బర్‌ను సందర్శించిన మహిళా కళాశాల విద్యార్థినులు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న సముద్ర జీవులపై అవగాహన పొందడంలో భాగంగా ఫిషరీ సర్వే ఆఫ్ ఇండియా నిర్వహించిన కార్యక్రమానికి నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల జువాలజీ విద్యార్థినులు మంగళవారం ఫిషింగ్ హార్బర్‌లోని మత్స్య దర్శిని, మత్స్యషికారి జెట్టి-6ను సందర్శించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల తెలిపారు. అంతరించిపోతున్న సముద్ర జీవులపై పలు విషయాలు తెలుసుకున్నారని పేర్కొన్నారు.

వార్డులో సమస్యలపై ఆరా



సమస్యలు ఆలకిస్తున్న జడ్సీ మల్లయ్య నాయుడు, కార్పొరేటర్ నాగరాజు

జ్ఞానాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 32వ వార్డు పరిధిలోని సౌత్ జైల్ రోడ్డు, నేరెళ్ల కోనేరు కూడలి, కృష్ణగార్డెన్స్ ప్రాంతాల్లో జోన్-4 జడ్సీ ఎం.మల్లయ్యనాయుడు, కార్పొరేటర్ కందుల నాగరాజు, జీవీఎంసీ జోన్ అధికారులు మంగళవారం పర్యటించారు. ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని, సకాలంలో రోడ్ల నిర్మాణం చేపట్టాలని జడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ మురళీకృష్ణ, ఏఈ విల్సన్ పాల్గొన్నారు.

'నాదం నీ దీవెన' గోడపత్రిక ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

డాబాగార్డెన్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): మెలోడీ క్రియేటర్స్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న సాయంత్రం 6 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కుమారి సలాది సత్యశ్రీచే మూడు గంటల సినీ సంగీత విభావరి 'నాదం నీ దీవెన' గోడపత్రికను సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ఆచార్య జీవీఎస్ఎన్ రాజు ఆవిష్కరించారు. డాబాగార్డెన్స్‌లోని సంస్థ కార్యాలయ ఆవరణలో మంగళవారం గోడపత్రికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు. మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, వి.ప్రభాకర్, ఎం.పుండరీకుమార్,ప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఐడీబీఐ బ్యాంకు వితరణ



మహాత్మాగాంధీ పాఠశాలలో మాట్లాడుతున్న ఐడీబీఐ జీఎం కాన్వదేబ్‌దాస్

డాబాగార్డెన్స్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఐడీబీఐ విశాఖ ప్రాంతీయ ప్రధాన జనరల్ మేనేజర్ కాన్వదేబ్‌దాస్ ఆకాంక్షించారు. మంగళవారం డాబాగార్డెన్స్ మహాత్మాగాంధీ పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు వారు కార్పొరేట్ సామాజిక బాధ్యతా వితరణ కింద మూడు బీరువాలు, 20 బెంచీలు, 100 భోజన ప్లేట్లు, 10 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐడీబీఐ అసిస్టెంట్ జీఎం బి.తులసి, రీజనల్ ఆఫీస్ అసిస్టెంట్ జీఎం కిరణ్, నరేష్ కర్రీశెట్టి, ప్రధానోపాధ్యాయుడు ఆర్‌వీవీఎస్ నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నిర్వహణ పనుల కారణంగా బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. సంఘం ఆఫీసు, జగన్నాథపురం, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, దాలిరాజు సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవార్ల ఉత్సవాలు



నక్కవానిపాలెంలో నూకాలమ్మ తల్లి

సీతమ్మధార, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డు నక్కవానిపాలెంలో వేపచెట్టు వద్ద గల గ్రామ దేవత నూకాలమ్మ తల్లికి పరస మహోత్సవం సందర్భంగా మంగళవారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని, చుట్టుపక్కల ప్రాంతాలను విద్యుత్ కాంతులతో సుందరంగా అలంకరించారు. ఉదయం నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, బుర్రకథ ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయ వీధులు భక్తులతో కిక్కిరిశాయి. ఆబాలగోపాలం పరసలో పాల్గొని తమకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసి ఆనందోత్సాహాల మధ్య అమ్మవారికి సమర్పించుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నక్క కాటరాజు రెడ్డి, ఉపాధ్యక్షులు యేండ్రెడుల వై.వెంకటేష్‌రెడ్డి, బోర రవికుమార్ రెడ్డి, కార్యదర్శి కారపు శ్యామలరావు, కోశాధికారి ధర్మల గురుమూర్తి రెడ్డి, సహాయ కార్యదర్శి నందిక వేణు తదితరులు భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. గ్రామ కమిటీ సభ్యులు నక్క రమేష్ రెడ్డి, బోర శ్రీనివాస్ రెడ్డి తదితరులు తోడ్పాటుఅందించారు.

పోలమాంబ దర్శనానికి భక్తుల తాకిడి

జగదాంబ కూడలి, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): లేపాక్షి వద్ద కుమ్మరవీధిలోని పోలమాంబ అమ్మవారి మారువారం ఉత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. పంచామృతాభిషేకం, జలాభిషేకం పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేకంగా తయారు చేయించిన పొంగలి, దద్యోజనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయం వద్ద భజన గీతాలాపన జరిగింది.



అలంకరణలో కుమ్మరవీధి పోలమాంబ అమ్మవారు

'రాజీనామా చేస్తే అక్రమాలు పోతాయా'?

అల్లిపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాజీనామా ఇచ్చినంత మాత్రాన చేసిన అక్రమాలు పోతాయా? అంటూ వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డిని ఉద్దేశించి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి వ్యాఖ్యానించారు. మంగళవారం అల్లిపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారాన్ని అడ్డంపెట్టుకొని విజయసాయిరెడ్డి అక్రమాలు చేసి నేడు రాజీనామా అంటూ కొత్త నాటకానికి తెరతీశారన్నారు. నగరం నడిబొడ్డున దసపల్లా భూములకు 22ఏను రద్దు చేసి తన బంధువులకు కట్టబెట్టేలా చేసిన కుట్ర వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. బీచ్ రోడ్డులో ఎంతో ప్రాముఖ్యత కలిగిన కార్తిక వనం భూములను అధికార బలంతో లాగేసుకొని రాడిసన్ బ్లూ హోటల్ కట్టించిన వ్యవహారంపై విచారణ జరపాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందని సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, జి.ఎస్.జె. అచ్యుతరావు, ఎస్‌కె రెహమాన్, ఎం.మన్మథరావు, పి. చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి

ఏకే 47 మిస్ ఫైర్!

- స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయం
- సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఆయుధాన్ని శుభ్రం చేసే క్రమంలో ఘటన
- మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు
- గోప్యంగా ఉంచిన పోలీసులు

సీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఏకే 47 మిస్ ఫైర్ అయి స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయమైంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం సీలేరు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీకి కేటాయించిన గది వద్ద ఆర్ఎస్ఐ కె.హరీష్ ఏకే 47లోని మ్యాగ్జైన్‌ను బయటకు తీసి శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి అతని కుడి కాలి పాదానికి గాయమైంది. వెంటనే అతనిని సీలేరు, చింతపల్లి పీహెచ్‌సీలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఏకే 47 మ్యాగ్జైన్ తొలగించే క్రమంలో ఒక రౌండ్ అందులో ఉండిపోవడంతో మిస్‌ఫైర్ అయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు.

రాయగడ సెక్షన్‌లో డీఆర్ఎం తనిఖీలు

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహు, రాయగడ డివిజన్ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్‌తో కలిసి రాయగడ సెక్షన్‌లో మంగళవారం తనిఖీలు చేశారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సర్క్యులేటింగ్ ఏరియా, పార్కింగ్ స్థలాలు, రిటైరింగ్ రూమ్‌లు, సిబ్బంది లాబీ, ఆర్ఆర్ఐ క్యాబిన్, రిలే రూమ్‌ల నిర్వహణను పరిశీలించి వాటి మెరుగుదలకు అవసరమైన చర్యలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికుల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. లడ్డా, జిమిడిపేట సెక్షన్‌లోని లెవెల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత చర్యల నిర్వహణపై సిబ్బందితో మాట్లాడారు. రాయగడ నుంచి విజయనగరం వరకు విండో ట్రైలింగ్ తనిఖీలు చేపట్టి ట్రాక్‌లు, వంతెనలు, మలుపులు, పాయింట్లు, క్రాసింగ్‌ల నిర్వహణను పరిశీలించారు. పార్వతీపురం స్టేషన్‌లో కొనసాగుతున్న పనులపై అధికారులతో ఇద్దరు డీఆర్ఎంలు సమీక్షించారు.

ఆసక్తికరంగా టెన్నిస్ టోర్నీ

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అయిస్టా నిర్వహిస్తున్న 18వ అఖిల భారత సీనియర్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆసక్తికరంగా సాగుతున్నాయి. ఆఫీసర్స్ క్లబ్‌లో రెండో రోజు మంగళవారం జరిగిన క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లో ఫేవరేట్ ప్లెయిర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. 55 ప్లస్ కేటగిరిలో విశాఖకు చెందిన రాజకుమార్ తొలి రౌండ్‌లో బి.ఎస్.రావుపై 9-2 స్కోరుతో, రెండో రౌండ్‌లో 9-4 స్కోరుతో ఒడిశాకు చెందిన గంగాధర్‌పై విజయం సాధించి మెయిన్ డ్రాకు అర్హత సాధించారు. 45 ప్లస్ కేటగిరీలో సీహెచ్.ధనుంజయనాయుడు 9-2 స్కోరుతో శంకర్‌పై గెలుపొంది మెయిన్ డ్రాకు ప్రవేశించారు. 35 ప్లస్, 45 ప్లస్, 55 ప్లస్, 65 ప్లస్ విభాగాల్లో జరిగిన పలు క్వాలిఫైయింగ్ రౌండ్ మ్యాచ్‌లలో విజేతలు బుధవారం నుంచి జరిగే మెయిన్ డ్రా మ్యాచ్‌ల్లో పాల్గొంటారని టోర్నీ డైరక్టర్ సతీష్ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ఉన్నత స్థాయి క్రీడాకారులు హాజరవుతున్న నేపథ్యంలో మ్యాచ్‌లు రసవత్తరంగా సాగుతాయని పేర్కొన్నారు.



55 ప్లస్ ఏజ్ కేటగిరీలో రాజ్‌కుమార్

ఆలిండియా మేజర్ పోర్ట్సు క్యారమ్స్ పోటీలు ప్రారంభం

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం పోర్టు అథారిటీ స్పోర్ట్సు కౌన్సిల్ నిర్వహిస్తున్న అఖిల భారత మేజర్ పోర్ట్సు క్యారమ్స్ చాంపియన్‌షిప్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. పోర్టు స్టేడియంలోని ఇండోర్ హాల్లో జరుగుతున్న ఈ పోటీలకు విశాఖపట్నం పోర్టు అథారిటీ డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. టోర్నీలో పాల్గొంటున్నవారు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ప్రతిభ చాటాలన్నారు. క్యారమ్స్‌కు ఆదరణ పెరుగుతోందని, నైపుణ్య ప్రదర్శనకు సాధన అవసరమన్నారు. మూడు రోజులు జరిగే టోర్నీలో ఆతిథ్య వీపీఏతోపాటు ముంబయి, దీన్‌దయాల్, కోల్‌కతా, చెన్నై, పారదీప్, జవహర్‌లాల్ నెహ్రూ, న్యూ మంగళూరు, కామరాజార్ పోర్టు అథారిటీ జట్లు పాల్గొనడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. విశాఖపట్నం పోర్టు అథారిటీకి చెందిన అంతర్జాతీయ క్రీడాకారుడు జనార్ధనరెడ్డిని సత్కరించి, వీపీఏకు మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. వీపీఏ కార్యదర్శి వేణుగోపాలరావు, అధికారులు పాల్గొన్నారు.



పోటీలో పాల్గొన్న ప్రముఖులు

అట్టహాసంగా క్రీడాపోటీలు



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, జేడీ వి.పద్మారావు,అధికారులు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కంచరపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాష్ట్ర స్థాయి 27వ అంతర్గత క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడల సమన్వయకర్త డా.కె.నారాయణరావు, సహ సమన్వయకర్త డా.బి.జానకిరామయ్యల పర్యవేక్షణలో జరిగిన ఈ క్రీడలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ, సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు వి.పద్మారావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. రఘు వర్మ ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహానికి, ఐక్యతకు, బృంద స్ఫూర్తికి దోహదపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కల్పనలో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తొలిరోజు లాంగ్ జంప్ బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.శివరామకృష్ణ (శ్రీకాకుళం), ఎన్.ఈశ్వర్‌వర్ధన్ (గిరిజాల), కె.ప్రశాంత్‌కుమార్ (పాడేరు) నిలిచారు. లాంగ్ జంప్ బాలికల విభాగంలో ఎం.యమున (ప్రకాశం), ఎస్.మల్లీశ్వరి (గిరిజాల), ఎం.కౌశల్య (కడప) గెలుపొందారు. షార్ట్‌పుట్ బాలికల విభాగంలో వి.ఎల్.ఎస్. కృష్ణ తులసి (తూర్పుగోదావరి), కె.భారతి (కృష్ణా), ఎ.రక్షిత (భీమిలి) నిలిచారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీలు సత్యనారాయణమూర్తి, నిర్మల కుమార్ ప్రియ, సాంకేతిక విద్య శిక్షణ మండలి కార్యదర్శి జీవీ రామచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి పాలనలో పర్యాటక రంగం పరుగులు: బాలాజీ

మహారాణిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పర్యాటక రంగంలో దూసుకు పోతోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ అన్నారు. మంగళవారం విశాఖ బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సెప్టెంబరులో టూరిజం డే రోజున ప్రకటించిన విధాన నిర్ణయాలతో నూతనోత్తేజం వచ్చిందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి విశాఖ, విజయవాడలలో సదస్సులు నిర్వహించామన్నారు. విశాఖలో జరిగిన సదస్సులో రూ.1200 కోట్ల పెట్టుబడులతో ఎనిమిది ఎంవోయూలు చేసుకున్నట్లు బాలాజీ పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో ఇంకొందరు పెట్టుబడిదారులు వస్తారని తెలిపారు. ప్రాజెక్టులకు నెల రోజుల్లోపు అనుమతులు వచ్చేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పర్యాటక శాఖను కూడా నాశనం చేసిందని, మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే నష్టపోతామని పెట్టుబడిదారులు భయపడుతున్నారని తెలిపారు. ప్రజలను కష్టపెట్టిన వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదని హామీ ఇస్తున్నామని పేర్కొన్నారు.

సమస్యల పరిష్కారమే అజెండా...

... 3వ పేజీ తరువాయి

చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీఐఐసీతో చర్చించిన తర్వాత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి డ్రైన్ మళ్లింపు లేదంటే కాలనీ తర్వాత అవుట్‌లెట్‌కు కనెక్షన్ ఇవ్వడంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

డంపింగ్ యార్డుతో కాలుష్యం

అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జి.విశ్వేశ్వరారావు మాట్లాడుతూ తమ కాలనీకి అనుకుని ఖాళీగా ఉన్న ఏపీఐఐసీ భూమిలో పరిశ్రమలు వ్యర్థాలను పడేస్తుండడంతో డంపింగ్ యార్డుగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. కళింగ నగర్‌కు చెందిన ఎం.అప్పయ్యమ్మ, తిరుమల నగర్‌కు చెందిన స్వాతి మాట్లాడుతూ అనధికార డంపింగ్‌యార్డులో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలకు నిప్పు పెట్టడం వల్ల వెలువడే దట్టమైన పొగ కారణంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సాయంత్రం నాలుగు దాటితే పిల్లలు బయటకు రాలేకపోతున్నారని, ఎన్నిసార్లు అధికారులను కోరినా ఫలితం లేకపోయిందన్నారు. దీనికి జోన్-5 సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ సమాధానం ఇస్తూ అనధికార డంపింగ్ యార్డు గురించి ఇటీవలే ఏపీఐఐసీ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేశామన్నారు. యార్డులో ఉన్న సగం వ్యర్థాలను ఇతర చోటకు తరలించారని, మిగిలినవి కూడా అక్కడకే తరలించేలా, ప్రహరీ నిర్మించేలా ఏపీఐఐసీ అధికారులపై ఒత్తిడి చేస్తామన్నారు.

కల్యాణ మండపాలు ఏవి

వడ్లపూడికి చెందిన కడుపుట్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ వడ్లపూడి, కణితి ప్రాంతాల్లో ఉన్న రెండు కల్యాణ మండపాలను గత ప్రభుత్వం వార్డు సచివాలయాలుగా మార్చేసిందని, ఎలాంటి శుభ కార్యక్రమాలు చేసుకోవాలనుకున్నా సరే ప్రైవేటు కల్యాణమండపాలకు భారీగా డబ్బులు ఖర్చుపెట్టాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుబజార్ నిర్మించినా వృధాగా ఉండిపోయినందున దానిని అందుబాటులోకి తేవాలని కోరారు. 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ దీనిపై స్పందిస్తూ, పాత మీ సేవా భవనం శిథిలావస్థలో ఉన్నందున దాని స్థానంలో కొత్తగా వార్డు సచివాలయ భవనం నిర్మించాల్సిందిగా జీవీఎంసీ కమిషనర్, గాజువాక ఎమ్మెల్యేలను కోరామన్నారు. నిధులు రాగానే కొత్తభవనం నిర్మించి కల్యాణ మండపాలను ఖాళీ చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామన్నారు.

తిరుమల నగర్‌కు చెందిన దేవీ మాట్లాడుతూ తమ ప్రాంతానికి గతంలో బస్సు ఉండేదని అధికారులు రద్దు చేయడంతో ఇబ్బందిపడుతున్నామన్నారు. అలాగే అనధికార డంపింగ్ యార్డును ఖాళీ చేసి అక్కడ సామాజిక భవనం నిర్మించాలని కోరారు. ఇందుకు ఆర్టీసీ కూర్మన్నపాలెం డిపో ట్రాఫిక్ మేనేజర్ కృపావరరావు మాట్లాడుతూ తమకు లిఖితపూర్వకంగా వినతిపత్రం ఇస్తే రెండు రోజుల్లో బస్సు సర్వీసు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.

ఆకతాయిల ఆగడాలు

దుగ్గపువానిపాలేనికి చెందిన డి.అప్పలనాయుడు, వడ్లపూడికి చెందిన కుమార్ మాట్లాడుతూ తమ ప్రాంతంలోని పాఠశాల ప్రాంగణంలో రాత్రిపూట ఆకతాయిలు చేరి, మత్తు పదార్థాలు సేవిస్తున్నారని, స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని ఫిర్యాదుచేశారు. పోలీసులు నిఘా పెంచాలని కోరారు. దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు స్పందిస్తూ ఇకపై రాత్రి గస్తీని పెంచడం ద్వారా ఆకతాయిల సమస్యకు అడ్డుకట్ట వేస్తామన్నారు. ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి వస్తే వెంటనే ఒక ఫోన్ చేస్తే ఐదు నిమిషాల వ్యవధిలో అక్కడకు చేరుకుని అదుపులోకి తీసుకుంటామని, వారి తల్లిదండ్రులను పిలిచి కౌన్సెలింగ్ చేస్తామన్నారు. కాలనీలో ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటుకు స్వచ్ఛంద సంస్థలు, కాలనీ అసోసియేషన్‌లు చొరవ తీసుకోవాలని కోరారు.

వడ్లపూడికి చెందిన కె.రమణ మాట్లాడుతూ వడ్లపూడి ప్రధాన రహదారిని ఆక్రమించి దుకాణాలు పెట్టడం వల్ల ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కార చర్యలు తీసుకోవాలని కోరారు. జోన్-5 డీఈ నారాయణ స్పందిస్తూ టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆలయ సమీపంలో మద్యం దుకాణం!

వడ్లపూడికి చెందిన రాము మాట్లాడుతూ వడ్లపూడి బస్టాప్‌కు, వినాయక ఆలయానికి సమీపంలో మద్యం దుకాణం పెట్టడం వల్ల ప్రతి ఒక్కరూ తాగి వాహనాలను నడుతున్నారని, దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని ఫిర్యాదు చేశారు. దీనికి సీఐ మల్లేశ్వరరావు సమాధానం ఇస్తూ ట్రాఫిక్ విభాగంతో కలిసి డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మందుబాబులపై కేసులు నమోదుచేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్రీగణేష్‌నగర్‌లో 49/4లో ప్రభుత్వ భూమిని కొందరు కబ్జా చేశారని, దానిని స్వాధీనం చేసుకుని ప్రజా ప్రయోజనానికి వినియోగించాలని ఆనంద్‌కుమార్ కోరారు. ఆ భూమిలో సర్వే చేసి ఆక్రమణలు ఉన్నట్టు తేలితే తొలగిస్తామని డిప్యూటీ తహసీల్దార్ హామీ ఇచ్చారు.

'ఆంధ్రజ్యోతి' బ్రాంచి మేనేజర్ కె.రామకృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్క్యులేషన్ డైరెక్టర్ కె.రామకృష్ణారావు, ఎడిషన్ ఇన్‌చార్జి ఎల్.వి.రామాంజనేయులు, బ్యూరో ఇన్‌చార్జి యర్రా శ్రీనివాసరావు, సర్క్యులేషన్ మేనేజర్ సత్యనారాయణ, సీనియర్ స్టాఫ్ రిపోర్టర్ ఆర్.వెంకటరావు, అడ్వర్‌టైజ్‌మెంట్ డిపార్టుమెంట్ ప్రతినిధి వరహాలు, గాజువాక పీసీ ఇన్‌చార్జి నారాయణరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే జోన్ పనుల్లో జాప్యం!

... 3వ పేజీ తరువాయి

ఉంది. కానీ ఇంతవరకూ వాటి గురించి ప్రస్తావన లేదు.

బడ్జెట్ సమావేశాలు

ఈ వారాంతంలో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ ప్రాంతానికి చెందిన ఎంపీలు, రాజ్యసభ సభ్యులు రైల్వేజోన్, వాల్తేరు డివిజన్ అంశం తప్పనిసరిగా మాట్లాడాల్సి ఉంది. శంకుస్థాపన అయిపోయింది కాబట్టి జోన్ వచ్చేసిందని సంబరపడాల్సిన పరిస్థితులు లేవు. జోన్ ప్రకటించిన ఐదేళ్లకు శంకుస్థాపన చేశారు. కేంద్రంపై ఒత్తిడి పెట్టకపోతే పనులు పూర్తికాని పరిస్థితులు ఉన్నాయి. విశాఖలో జోన్ కార్యకలాపాలు ఇప్పటికిప్పుడు ప్రారంభించడానికి అవసరమైన భవనాలు అందుబాటులో ఉన్నాయి. దీనికి అవసరమైన ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీని నియమించాలి. ఆ దిశగా ఎంపీలు ఒత్తిడి పెట్టాలి. అప్పుడే అనుకున్నవన్నీ సాధ్యమవుతాయి.

తాత్కాలిక సిబ్బంది అవసరం

రైల్వేజోన్‌కు నిధుల కేటాయింపుపై 25 మంది ఎంపీలు, 11 మంది రాజ్యసభ సభ్యులు ప్రశ్నించాలి. జోన్ కార్యాలయం నిలదొక్కుకునేంత వరకూ సికింద్రాబాద్ కార్యాలయం నుంచి తాత్కాలికంగానైనా పెద్ద సంఖ్యలో సిబ్బందిని కేటాయించాల్సి ఉంది. రాయగడ డివిజన్‌కు ఇక్కడి నుంచి భారీగా ఉద్యోగులను తరలిస్తున్నారు. వీటన్నింటిపై ఎంపీలు చర్చించాలి. విశాఖకు అన్యాయం జరగకుండా చూడాలి. -

చలసాని గాంధీ, మాజీ ప్రధాన కార్యదర్శి, తూర్పు కోస్తా రైల్వే శ్రామిక యూనియన్

నాలుగేళ్లుగా నాన్చుడు..

... 3వ పేజీ తరువాయి

దిగి యాజమాన్యంతో మాట్లాడి నౌకను తీసుకుంది. పర్యాటక శాఖకు అనుకూలంగా దానిని మార్చి ఇవ్వడానికి అంగీకరించింది. దీనిని కొంత భాగం మ్యూజియంగా, మరికొంత భాగం రెస్టారెంట్‌గా ఉపయోగించుకోవాలని ఒక అవగాహనకు వచ్చారు.

అటవీ శాఖ నుంచి భూమి

తెన్నేటి పార్కు తీరంలో చిక్కుకుపోయిన నౌకను వారాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు సందర్శిస్తుంటారు. కొందరు తెన్నేటి పార్కు మెట్లు దిగి నౌక వద్దకు వెళుతుంటే...మరికొందరు పార్కు దాటి ముందుకు వెళ్లి జోడుగుళ్లపాలెం బీచ్ మీదుగా వెళుతున్నారు. రహదారి వేయాలని పర్యాటక శాఖ అధికారులు అనుకున్నారు. అదంతా అటవీ శాఖకు చెందినది కావడంతో సంప్రతింపులు జరిపి అనుమతి తీసుకున్నారు.

సీఆర్‌జెడ్ అనుమతి కోసం వెయిటింగ్

నౌక నిలిచిపోయిన ప్రాంతం కోస్తా నియంత్రణ మండలి(సీఆర్‌జెడ్) పరిధిలో ఉంది. అక్కడ ఎటువంటి వ్యాపార కార్యక్రమాలు, నిర్మాణాలు చేపట్టాలనుకున్నా ఏపీ కోస్టల్ మేనేజ్‌మెంట్ బోర్డు అనుమతి తీసుకోవాలి. అక్కడకు కూడా ఫైల్ పంపారు. నౌకను ఏ విధంగా ఉపయోగించాలనుకుంటున్నారు?, దాని వల్ల పర్యావరణ నష్టాలు ఏమిటి?, రెస్టారెంట్ పెడితే వ్యర్థాలు ఏమి చేస్తారు?...తదితర అంశాలను వివరించాల్సి ఉంది. పర్యాటక శాఖ అధికారులు చెప్పిన మాటలు విశ్వసనీయంగా ఉంటే బోర్డు అనుమతి ఇస్తుంది. లేదంటే తిరస్కరించే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా బోర్డుతో సంప్రతింపులు జరుపుతున్నారు. అక్కడ ఏమి జరిగిందో విశాఖ అధికారులకు తెలియదు. అడిగితే ఆ నౌకకు సంబంధించిన వ్యవహారాలన్నీ అమరావతి అధికారులు చూసుకుంటున్నారని చెప్పి తప్పించుకుంటున్నారు. అమరావతిలో అధికారులు ఎప్పటికప్పుడు మారిపోతున్నారు. ఇప్పుడు కూడా కొత్త అధికారులు వచ్చారు. వారైనా సీరియస్‌గా తీసుకొని ఈ నౌకకు అనుమతులు తీసుకువస్తారా? లేదంటే...అలాగే వదిలేస్తారా? అనేది వేచి చూడాలి.

ఉక్కు ఉద్యోగులకు అందని వేతనాలు

... 3వ పేజీ తరువాయి

మాత్రం దారుణంగా ప్రవర్తిస్తోంది. జీతాల కోసం ఆందోళన చేస్తే షోకాజ్ నోటీసులు ఇస్తోంది. పెన్షనర్లకు పెన్షన్లు కూడా ఇవ్వడం లేదు. మరోవైపు వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రీ ఢిల్లీ నుంచి విశాఖపట్నం వచ్చారు. ఉద్యోగులను పిలిచి, వారిలో ధైర్యం నింపాల్సిన ఆయన వారితో మాట్లాడడానికే నిరాకరిస్తున్నారు. గురువారం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి వచ్చినప్పుడు జీతాలు ఇవ్వడం లేదని ఉద్యోగులు ఆందళన చేస్తారేమోనన్ భయంతో నవంబరు నెలకు సంబంధించిన బకాయి 65 శాతంలో 35 శాతం ఇప్పుడు చెల్లించారు. ఇంకా సెప్టెంబరు నెలకు సంబంధించి 50 శాతం, అక్టోబరు 50 శాతం, నవంబరులో మిగిలిన 30 శాతం, డిసెంబరు 100 శాతం జీతాలు రావలసి ఉంది. ఉద్యోగుల కడుపులు మాడ్చి, 100 శాతం ఉత్పత్తి సాధించాలని ఏ యాజమాన్యం అనుకోకూడదు. ఇక్కడ యాజమాన్యం విచిత్రంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటోంది. దీనిపై మంత్రి, పెద్దలు ఆలోచించుకొని అందరినీ కలుపుకొని వెళ్లేలా ప్రణాళిక తయారు చేసుకోవలసి ఉంది.

రూ.10 కోట్లతో నూతన బ్యారెక్

» జైలు డెప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్

ఆరిలోవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కారాగారంలో కొత్త బ్యారెక్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు నిధులు మంజూరు చేసిందని జైలు డెప్యూటీ సూపరింటెండెంట్ సాయిప్రవీణ్ తెలిపారు. ఈ నిధులతో 200 సామర్థ్యం గల బ్యారెక్ నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జీ ప్లస్ వన్ ప్లాన్ ప్రకారం ఈ నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. ఇందుకోసం స్థలం సర్వే కూడా చేపట్టడం జరిగిందన్నారు. ఈ భవనం అందుబాటులోకి వస్తే జైలు స్థలాభావం సమస్య కొంతవరకు తగ్గుతుందన్నారు.

ఇంటర్, పది పరీక్షల కోసం ఖైదీలకు శిక్షణ

ఆరిలోవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : కేంద్రకారాగారంలో గల ఖైదీలు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కల్పిస్తున్నట్టు జైలు డెప్యూడీ సూపరింటెండెంట్ ఎన్.సాయిప్రవీణ్ తెలిపారు. ప్రస్తుతం ఓపెన్ విద్య ద్వారా ఇంటర్ పరీక్షలకు 10 మంది హాజరవుతున్నట్టు చెప్పారు అలాగే పదో తరగతి పరీక్షలకు 30 మంది హాజరు కానున్నట్టు చెప్పారు. వీరిని ఇక్కడి సిబ్బంది తగిన శిక్షణ అందించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారని తెలిపారు.

ఉత్తరాంధ్రకు రూ.50 వేల కోట్లు ఇవ్వాలి

సిరిపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర రాష్ట్ర పునర్విభజన చట్టం ఆధారంగా ఉత్తరాంధ్రకు రూ.50 వేల కోట్ల నిధిలిచ్చి పెండింగ్ నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఏ.అజశర్మ లేఖ ద్వారా కోరారు. ఈ ఫిబ్రవరి 1న 2025-26 కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర, రాయలసీమ ప్రాంతాలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేయాలని కోరారు.

ఈ పదేళ్ల కాలంలో కేంద్రం ఇచ్చిన నిధులు ఒక్కో జిల్లాకు నామమాత్రం రూ.100 కోట్ల మాత్రమేనన్నారు. దీంతో ఏ అభివృద్ధి జరగలేదన్నారు. విశాఖ రైల్వే డివిజన్‌తో కూడిన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఆఫీసుల నిర్మాణం పూర్తయ్యేలా వెంటనే తాత్కాలిక భవనాల నుంచి పాలన ప్రారంభించాలని చట్ట ప్రకారం విశాఖ, విజయవాడ మెట్రో రైల్ నిర్మాణాలను ప్రారంభించాలని, రాష్ట్ర ప్రత్యేక హోదా కల్పించాలని , స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

ప్రతి బడ్జెట్‌లోనూ ఏపీకి అన్యాయమే జరగుతోందని వాపోయారు. కనీసం ఈ సారైన నిధుల కేటాయింపులో రాష్ట్రానికి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర పునర్విభజన ప్రకటన మేరకు నిధులు కేటాయిస్తే రాష్ట్రాభివృద్ధికి దోహదపడిన వారవుతారన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడీ, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 32, టమాటా 12, వంకాయలు (తెలుపు)24, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 48, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 46, బీరకాయలు 54, ఆనపకాయ 14, కాలీఫ్లవర్ 12, క్యాబేజి 14, క్యారెట్ 26 దొండకాయలు 40, బంగాళ దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)44, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 250, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 44, పొటల్స్ 80, కీర దోస 34, కాప్సికమ్ 40, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 42, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 32, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 150, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 18, మామిడి అల్లం 46, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	105
లైవ్ ధర	125
విత్ స్కిన్	220
స్కిన్‌లెస్	230

పర్యావరణానికి ప్రజా సహకారం అవసరం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి వెంకటశేషమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ వెంకటశేషమ్మ

వెంకోజీపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు నగర ప్రజలు సహకరించాలని విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సివిల్ జడ్జి ఎం.వెంకటశేషమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్‌యస్ఏ) సంయుక్తంగా జీవీఎంసీతో కలిసి 'సుస్థిర నీటి నిర్వహణ, ప్లాస్టిక్, ఘన వ్యర్థ పదార్థాలను నిర్వహించడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించడం' అనే అంశంపై వర్క్‌షాప్, అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ వివిధ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి చెప్పి ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయకుండా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ఆ వ్యర్థాలను అందించేలా ప్రజలు క్రమశిక్షణతో మెలగాలని కోరారు. వేడివేడి ఆహార పదార్థాలను సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లలో తీసుకువెళ్లడం ద్వారా క్యాన్సర్ వంటి వ్యాధులు, సమస్యలు తలెత్తుతున్నాయని వైద్యుల పరిశోధనలో తేలిందని తెలిపారు. నీటి నిర్వహణపై మాట్లాడుతూ ఇంకుడు గుంతలను తవ్వి వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను సంరక్షించాలని, మురుగునీటిని నేరుగా సహజ నీటి ప్రవాహాలలోకి విడుదల చేయకుండా వాటిని శుద్ధి కర్మాగారాలలోకి తరలించి మురుగు నీటిని శుద్ధికరణ చేసి పరీక్షలు నిర్వహించి అవి పూర్తిగా శుద్ధి అయినట్టు నిర్ధారించుకున్నాకే ఆ నీటిని సముద్రంలోకి వదిలేలా పర్యవేక్షించాలని ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రతినిధులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రజల జీవన విధానంలో మార్పులు రావాలని కోరారు. ఈ జీవన విధానం ప్రతి కుటుంబంలోనూ బాల్యం నుంచే అవలంబించాలని దాని కోసం పాఠశాలలో పర్యావరణ పరిరక్షణకై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పాఠ్యాంశాలలో వీటి ప్రాముఖ్యతను ప్రచురించేలా ప్రభుత్వాలు చొరవ చూపాలన్నారు. అలాగే పర్యావరణ పరిరక్షణపై పలు చట్టాలను ఆమె క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో జేసీ శ్రీరామ్‌మూర్తి, విశ్రాంత ప్రొఫెసర్లు ఎస్.రామకృష్ణారావు, ఇ.ఉదయభాస్కర్ రెడ్డి, జీవీఎంసీ అధికారులు, పరిశ్రమల నుంచి అధికారులు, జీవీఎంసీ యూసీడీ విభాగం నుంచి ఆర్పీలు, జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు., వివిధ ఎన్జీవోలు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి శాపం

గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

మద్దిలపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి శాపమని గ్రీన్ క్లైమేట్ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. మద్దిలపాలెం అక్షర పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పర్యావరణంపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిరమైన నీటి వనరుల కోసం ప్రభుత్వం నిషేధించిన 16 రకాల ప్లాస్టిక్ వినియోగించకూడదన్నారు. కాలుష్య కారకాలను నిర్మూలించి ఎకో వైజాగ్‌ను జయప్రదం చేయాలని కోరారు. స్వచ్ఛందంగా ప్లాస్టిక్‌ను విడనాడి పర్యావరణ హితంగా జీవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ రోయల్స్ సభ్యురాలు చాందిని, రామ్, అప్పారావు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో పర్యాటక రంగం పరుగులు

» పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ వెల్లడి

మహారాణిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్రం పర్యాటక రంగంలో దూసుకు పోతోందని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ బాలాజీ అన్నారు. మంగళవారం విశాఖ బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సెప్టెంబరులో టూరిజం డే రోజున ప్రకటించిన విధాన నిర్ణయాలతో నూతనోత్తేజం వచ్చిందని తెలిపారు. పర్యాటక అభివృద్ధికి విశాఖ, విజయవాడలలో సదస్సులు నిర్వహించామన్నారు. విశాఖలో జరిగిన సదస్సులో రూ.1,200 కోట్ల పెట్టుబడులతో ఎనిమిది ఎంవోయూలు చేసుకున్నట్లు బాలాజీ పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో ఇంకొందరు పెట్టుబడిదారులు వస్తారని తెలిపారు. ప్రాజెక్టులకు నెల రోజుల్లోపు అనుమతులు వచ్చేలా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. గతంలో వైసీపీ ప్రభుత్వం పర్యాటక శాఖను కూడా నాశనం చేసిందని, మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే నష్టపోతామని పెట్టుబడిదారులు భయపడుతున్నారని తెలిపారు. ప్రజలను కష్టపెట్టిన వైసీపీ మళ్లీ అధికారంలోకి రాదని హామీ ఇస్తున్నామని పేర్కొన్నారు. పెట్టుబడులు రాష్ట్రానికి రావటానికి కారణం చంద్రబాబు అని, ప్రజలు కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను, నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని బాలాజీ అన్నారు. నారా లోకేశ్ 'యువగళం' ద్వారా తన నాయకత్వాన్ని నిరూపించుకున్నారని, యువతలో పార్టీపై నమ్మకం కలిగించారనిపేర్కొన్నారు. అమరావతి నిర్మాణం, ఆధ్యాత్మిక పర్యాటకం, ఐటీ రంగంలో అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని వివరించారు.

సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ సేవలు అమోఘం



కండిపల్లి నర్సింగరావు దంపతులను సన్మానిస్తున్న జీఎస్ఎన్ రాజు తదితరులు

సిరిపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సినీ రంగానికి ఎన్టీఆర్, ఏఎన్నార్ అందించిన సేవలు ఎనలేనివని పలువురు కళారంగ ప్రముఖులు పేర్కొన్నారు.మంగళవారం సిరిపురం డౌన్‌లోని ఓ హాల్‌లో ఎన్టీఆర్, ఏయన్నార్, ఘంటసాల జయత జయంతి ఉత్సవాల్లో భాగంగా నగరానికి చెందిన స్వరార్చన సినీ సంగీత విభావరి ఆద్యంతం అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ జీఎస్ఎన్ రాజు, కళా రంగ ప్రముఖులు డి.భూపతిరావు, ఫణిస్వామి, కొణతాలరాజు, ఎండీ ఖాన్, సత్యనారాయణ హాజరై జ్యోతి ప్రజ్వలనగావించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు చిత్రసీమకు ఎన్టీఆర్, ఏఎన్నార్ దిక్సూచిగా నిలిచారన్నారన్నారు.కళలకు విశేషంగా సేవలందిస్తున్న ఏఎస్ఐ, గాయకుడు అల్లిపిల్లి నర్సింగరావు దంపతులను ఘనంగా సన్మానించారు.విభావరిలోని ఫణి, భూపతి, కృష్ణంరాజు, రంజిత, చారి, నీలిమ, భాగ్యలక్ష్మి, సుజాత గీతాలను శ్రావ్యంగా ఆలపించి అలరించారు. కార్యక్రమంలో సాహితీప్రియులు,సంగీత కళాకారులు, గాయనీగాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్ర తదితరులు

ఏడాదిగా ఒక్క టెస్టు జరిగితే ఒట్టు

రాష్ట్ర ఆహార ప్రయోగశాల పనితీరుపై బీజేపీ నేత రవీంద్ర ధ్వజం

పెదవాల్తేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడ గల ప్రభుత్వ ఈఎన్టీ ఆస్పత్రి పక్కన ఉన్న ఫుడ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న రాష్ట్ర ఆహార ప్రయోగశాలలో ఏడాదిగా ఒక్క టెస్టు కూడా చేపట్టకపోవడం దారుణమని బీజేపీ విశాఖ పార్లమెంటరీ మాజీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్రబాబు అన్నారు. మంగళవారం నగర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో అయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో మూడు ల్యాబరేటరీలను ఏర్పాటు చేసిందన్నారు. అందులో గత ఏడాది ఫిబ్రవరిలో విశాఖపట్నంలో ఓ ల్యాబరేటరీని ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారన్నారు. అయితే అప్పటి నుంచి కనీసం ఒక్క టెస్టు ఇక్కడ చేపట్టకపోవడం ఆశ్చర్యం, విస్మయం కలిగిస్తోందన్నారు. ఇక్కడ చేపట్టాల్సిన టెస్టులకు సంబంధించిన శాంపిల్స్ అన్నింటినీ ప్రైవేట్ ల్యాబ్‌లకు పంపించి ఒక్కో టెస్టుకు సుమారు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు కేంద్ర ప్రభుత్వ ధనాన్ని వృథా చేస్తూ అధికారులు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. ఈ విషయాన్ని అనేక పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇక్కడ మెషీన్లు కూడా మరమ్మతులకు గురవుతున్నాయన్నారు. అంతేకాకుండా పూర్తి స్థాయి భద్రత లేకపోవడంతో వల్ల ఇక్కడ ఉన్న విలువైన పరికరాలు తరలిపోయే పరిస్థితి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. అలాగే ఈ ప్రాంతంలో రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు విమర్శలు వస్తున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి ఆహార ప్రయోగ శాల సక్రమంగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ పత్రాల అందజేత



బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరు పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

ఎంవీపీ కాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధ పడుతున్న ఇద్దరికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) పత్రాలను ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మంగళవారం అందజేశారు. జీవీఎంసీ 17వ వార్డు పరిధిలోని కొరగంజి మణిదీప్‌కు రూ.4,24,715లు, తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌కు చెందిన వీవీవీ సత్యనారాయణ మూర్తికి రూ. 81 వేలు మంజూరైన సంబంధిత ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు గొలగాని పోలరావు, బైరెడ్డి పోతరెడ్డి, అక్కరబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వల్లే ఆ ఇద్దరి సస్పెన్షన్

ఆరిలోవ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : విశాఖ కేంద్రకారగారంలో ఇటీవల సస్పెండ్‌కు గురైన అప్పటి సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు విధులు సక్రమంగా నిర్వహించకపోవడమే కారణమని తెలిసింది. వీరి సస్పెన్షన్ విషయమై దర్యాప్తు చేసేందుకు ఒక బృందం వచ్చింది. ఆ బృందం కొంతమంది జైలు సిబ్బందిని విచారించింది. ఈ విచారణలో సదరు అధికారులు సరిగా విధులు నిర్వహించలేదన్న విషయం నిర్ధారణ అయినట్టు తెలిసింది. దీనిపై నివేదికను దర్యాప్తు బృందం జైలు శాఖ అధికారులకు అందజేయనుంది.

ఏయూ వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో సమీక్ష



మాట్లాడుతున్న వీసీ శశిభూషణరావు

వెంకోజీపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : ఏయూలోని వ్యవసాయ ఆర్థిక పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో రివ్యూ సమావేశం మంగళవారం జరిగింది. ఏఈఆర్‌సీ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ లిల్లిగ్రేస్ ఆధ్వర్యంలో, ఏయూ వీసీ జి.శశిభూషణరావు అధ్యక్షతన పరిశోధన కేంద్రంపై రివ్యూ నిర్వహించారు. 56 ఏళ్ల చరిత్ర గల ఈ పరిశోధన కేంద్రంలో జరిగిన, జరుగుతున్న పరిశోధనలపై, పరిపాలనకు సంబంధించినటువంటి విషయాలు గురించి విచ్చేసిన భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధులు సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపల్ ఎకనామిక్ అడ్వైజర్ దేవజిత్‌ఖౌండ్, అడ్వైజర్ ప్రమోదిత సతీష్, ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఏయూ ఫైనాన్స్ అధికారి, కేంద్రం సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు. సంస్థ అభివృద్ధి, పరిశోధనల ప్రగతిపై వీరు సంతృప్తి వ్యక్తం చేశారు.

అట్టహాసంగా క్రీడాపోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ, జేడీ వి.పద్మారావు,అధికారులు



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

కంచరపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం రాష్ట్ర స్థాయి 27వ అంతర్గత క్రీడలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. క్రీడల సమన్వయకర్త డా.కె.నారాయణరావు, సహ సమన్వయకర్త డా.బి.జానకిరామయ్యల పర్యవేక్షణలో జరిగిన ఈ క్రీడలను ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘు వర్మ, సాంకేతిక విద్యాశాఖ సంయుక్త సంచాలకుడు వి.పద్మారావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. రఘు వర్మ ముందుగా క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి శాంతి కపోతాలను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు స్నేహానికి, ఐక్యతకు, బృంద స్ఫూర్తికి దోహదపడతాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాల కల్పనలో క్రీడాకారులకు రెండు శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. తొలిరోజు లాంగ్ జంప్ బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో కె.శివరామకృష్ణ (శ్రీకాకుళం), ఎన్.ఈశ్వర్‌వర్ధన్ (గిరిజాల), కె.ప్రశాంత్‌కుమార్ (పాడేరు) నిలిచారు. లాంగ్ జంప్ బాలికల విభాగంలో ఎం.యమున (ప్రకాశం), ఎస్.మల్లీశ్వరి (గిరిజాల), ఎం.కౌశల్య (కడప) గెలుపొందారు. షార్ట్‌పుట్ బాలికల విభాగంలో వి.ఎల్.ఎస్. కృష్ణ తులసి (తూర్పుగోదావరి), కె.భారతి (కృష్ణా), ఎ.రక్షిత (భీమిలి) నిలిచారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్యాశాఖ ఆర్జేడీలు సత్యనారాయణమూర్తి, నిర్మల కుమార్ ప్రియ, సాంకేతిక విద్య శిక్షణ మండలి కార్యదర్శి జీవీ రామచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయభాస్కర్, కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ డైరెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ స్థలంలో బడ్డీల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బడ్డీలను తొలగిస్తున్న పోలీసులు

వెంకోజీపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15, 16వ వార్డులలోని స్టీల్‌ప్లాంట్ స్థలాలకు ఆనుకుని అక్రమణ బడ్డీల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయంటూ ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి స్టీల్‌ప్లాంట్ అధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో డిప్యూటేషన్ పోలీసులు మంగళవారం తొలగించారు. ప్రస్తుతానికి ఖాళీగా ఉన్న బడ్డీలను తొలగించి, మిగిలిన వ్యాపారాలు కొనసాగిస్తున్న వారికి కొంత సమయం ఇచ్చి, త్వరలోనే వాటిని ఖాళీ చేయాల ఆదేశించారు. లేకపోతే తామే తొలగించాల్సి వస్తుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ల్యాండ్ ఎస్టేట్ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో సిబ్బంది కోటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు ఇతరులు బడ్డీలను తొలగించారు. ఇప్పటికే స్థలాలలో ఉన్న పశువుల పెంపకాన్ని నిరోధించామని, త్వరలోనే బడ్డీలను కూడా పూర్తిగా తొలగించి, కొనుగోలు చేసుకునే వారికి ఎటువంటి అంతరాయం కలుగకుండా చూస్తామని జనార్ధన్ తెలిపారు.

సామాజిక వికాసంతోనే సంతులిత అభివృద్ధి

వెంకోజీపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక వికాసంతోనే సంతులిత అభివృద్ధి సాధ్యపడుతుందని ఏయూలోని సోషల్ వర్క్ విభాగాధిపతి ఎస్.హరనాథ్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని రోడా మిస్ట్రీ కళాశాల సోషల్ వర్క్ విద్యార్థులు మంగళవారం ఏయూలోని సోషల్ వర్క్ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సోషల్ వర్క్ హరనాథ్ మాట్లాడుతూ విద్యార్థులకు సామాజిక చైతన్యం ఎంతో ముఖ్యమన్నారు. దేశ వికాసంలో సోషల్ వర్క్ పరిధి ఎంతో ఉందన్నారు. విద్యార్థులకు అంకిత భావం, కమ్యూనికేషన్ స్కిల్స్, సునిసిత పరిశీలన ఎంతో ముఖ్యం అన్నారు. మానవ వనరులను సమ్మిళితం చేయడం ద్వారా మరింత ప్రగతి సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయభవానీ, డాక్టర్ శ్రీరామ్, సోషల్ వర్క్ విభాగం ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ కోమలి సలోమి, అబ్రహం, వేసవిలా, ఆశాకిరణ్, పుష్పలత, శిరీష, లక్ష్మణరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకే 47 మిస్ ఫైర్!

» స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయం
» సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఆయుధాన్ని శుభ్రం చేసే క్రమంలో ఘటన
» మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలింపు
» సంఘటనను గోప్యంగా ఉంచిన పోలీసులు

సీలేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్‌లో ఏకే 47 మిస్ ఫైర్ అయి స్పెషల్ పార్టీ ఆర్ఎస్ఐ కాలికి గాయమైంది. అయితే ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం సీలేరు పోలీస్ స్టేషన్‌లో స్పెషల్ పార్టీకి కేటాయించిన గది వద్ద ఆర్ఎస్ఐ కె.హరీష్ ఏకే 47లోని మ్యాగ్జిన్‌ను బయటకు తీసి శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అయి అతని కుడి కాలి పాదానికి గాయమైంది. వెంటనే అతనిని సీలేరు, చింతపల్లి పీహెచ్‌సీలకు తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఏకే 47 మ్యాగ్జిన్ తొలగించే క్రమంలో ఒక రౌండ్ అందులో ఉండిపోవడంతో మిస్‌ఫైర్ అయినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ విషయం బయటకు పొక్కకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు.

మంత్రుల పర్యటన విజయవంతం చేయండి

పెదవాల్తేరు, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) :ఈ నెల 30న విశాఖ వస్తున్న కేంద్ర ఉక్కుశాఖా మంత్రి కుమార్ స్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరశురామ్ రాజు కోరారు.

సమస్యల ఏకరువు

'ఆంధ్రజ్యోతి' 'అక్షరం అండగా... సమస్యల పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేష స్పందన

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..

భారీగా హాజరైన తిరుమలనగర్ వాసులు

» పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారుల హామీ

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని ప్రజాసమస్యల పరిష్కారానికి వీలుగా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు వారధిగా నిలుస్తూ 'ఆంధ్రజ్యోతి' ఆధ్వర్యంలో గాజువాక నియోజకవర్గం తిరుమలనగర్‌లో మంగళవారం నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తిరుమలనగర్‌తోపాటు జీవీఎంసీ 87వవార్డు పరిధిలోని పలుప్రాంతాల ప్రజలు భారీగా హాజరై తమ సమస్యలను ప్రస్తావించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారు. ఏళ్లనాటి సమస్యలను ఎవరికి వారుగా అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సకాలంలో స్పందన లభించడం లేదని, 'ఆంధ్రజ్యోతి' నిర్వహించిన కార్యక్రమంద్వారా వెలుగులోకి తేవడంతో వాటికి శాశ్వత పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నామని తిరుమలనగర్ వాసులు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల నిర్వహణతో ప్రజలు- ప్రభుత్వానికి వారధిగా నిలిచిన 'ఆంధ్రజ్యోతి' యాజమాన్యానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.







'ఆంధ్రజ్యోతి' సర్క్యులేషన్ డైరెక్టర్ రామకృష్ణారావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం, మాట్లాడుతున్న బ్రాంచి మేనేజర్ రామకృష్ణారావు, 'ఆంధ్రజ్యోతి దినపత్రిక చదువుతున్న మహిళలు



● **సమస్య:** తిరుమలనగర్‌లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. ఏ మాత్రం వర్షం పడినా నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగునీరు పోయేందుకు అవకాశం లేక దుర్గంధభరితంగా మారుతోంది. అనారోగ్య సమస్యల బారిన పడుతున్నాం.

- ఎం.పరమానందం, తిరుమలనగర్ వర్కింగ్ జనరల్ సెక్రటరీ



● **సమాధానం:** డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటాం. మురుగునీరు నిల్వ లేకుండా, సులువుగా దిగువకు పోయేలా డ్రైనేజీల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తాం.

- నారాయణ, జీవీఎంసీ, డీఈ



● **సమస్య:** వడ్లపూడి ప్రధాన రహదారిలో అక్రమ నిర్మాణాలు, దుకాణాలతో రోడ్డు కుదించుకుపోయింది. దీంతో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నాం. చెట్లను పెంచే చర్యలు తీసుకోవాలి. రోడ్ల ఆక్రమణలను తొలగించాలి.

- కె.రమణ, వడ్లపూడి

● **సమాధానం:** రోడ్లపై ఆక్రమణలను టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సహకారంతో తొలగిస్తాం. రోడ్ల మలుపు వద్ద ఫ్రీ లెఫ్ట్, ఫ్రీ రైట్‌ల కోసం చర్యలు తీసుకుంటాం. రెండు, మూడు రోజుల్లో సర్వే చేసి, నివేదిక ఉన్నతాధికారులకు అందజేసి సమస్య పరిష్కరిస్తాం.

- నారాయణ, డీఈ, జీవీఎంసీ



● **సమస్య:** వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో కల్యాణ మండపాలు లేవు. శుభ కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రైవేటు కల్యాణ మండపాలను ఆశ్రయించే ఆర్థిక స్థోమత ఇక్కడి వారికి లేదు. ఉన్న మండపాలను గతంలో సచివాలయాలకు కేటాయించేశారు. క్రీడాకారులకు తగిన మైదానం కూడా లేదు.

- కడుపుట్ల శ్రీనివాసరావు, వడ్లపూడి



● **సమాధానం:** కల్యాణ మండపాలను సచివాలయాలుగా వినియోగిస్తుండడంతో ఎదురవుతున్న సమస్యలను ఇప్పటికే కౌన్సిల్‌లో చర్చించాం. త్వరలో ప్రజలకు కల్యాణ మండపాలను అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- బొండా జగన్, కార్పొరేటర్



● **సమస్య:** వడ్లపూడి 90 ఫ్లాట్‌ల అపార్టుమెంటును ఆనుకొని ప్రధాన గెడ్డ ఉంది. ఎగువ నుంచి వచ్చిన మురుగునీరు అడ్డంకులు ఏర్పడి ఇక్కడ నిల్వ ఉండిపోతోంది. దీంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారుతున్నాయి. శానిటరీ సిబ్బంది ఆశించిన మేర పనులు చేయడం లేదు.

- శివప్రసాదరావు, వడ్లపూడి



● **సమాధానం:** పారిశుధ్య కార్మికుల సంఖ్య తక్కువగా ఉండడంతో ఇబ్బందులున్న మాట వాస్తవమే. అయినా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. అపార్టుమెంటు పక్కన గల గెడ్డలో మురుగునీరు సులువుగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటాం. ఇంట్లో చెత్తను వ్యాన్‌లకు మాత్రమే అందించాలి. కొంతమంది కాలువల్లో పడేయడంతో సమస్య పెద్దదిగా మారుతోంది.

- కిరణ్‌కుమార్, ఏఎంహెచ్‌వో, జీవీఎంసీ



● **సమస్య:** వడ్లపూడి సర్వేనంబరు 49/4లో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించుకున్నారు. దానిలో ఇళ్లు కట్టుకున్నారు. మరికొంత స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణానికి సిద్ధపడుతున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి లైబ్రరీ, వృద్ధాశ్రమ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. అయినా ఆక్రమణలు ఆగలేదు.

- అప్పారావు, శ్రీగణేష్‌నగర్ కాలనీ



● **సమాధానం:** ప్రభుత్వ స్థలంలాన్ని ఎవరు ఆక్రమించినా ఉపేక్షించేదిలేదు. 49/4 సర్వేనంబరులోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించినట్టు మా దృష్టికి వచ్చింది. దీనిపై ప్రత్యేక బృందంతో సర్వే చేస్తాం. ఆక్రమణలు ఉంటే తొలగిస్తాం. అందులో లైబ్రరీ ఏర్పాటుచేయాలని వచ్చిన ప్రతిపాదనలను ఆమోదానికి పంపాం.

- శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్, గాజువాక



● **సమస్య:** తిరుమలనగర్‌ను అనుకుని ఆటోనగర్ ఈ బ్లాక్‌లో పలు కర్మాగారాల నుంచి వెలువడే వ్యర్థాలను ఖాళీ స్థలంలో వేసి వాటికి సాయంత్రం వేళ నిప్పు పెడుతున్నారు. కెమికల్స్‌తో కూడిన పొగ కాలనీవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. దీనివల్ల శ్వాసకోశ వ్యాధులు వస్తున్నాయి. అక్కడి చెత్తను తొలగించి, స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ఏపీఐఐసీ, జీవీఎంసీ అధికారులను కోరినా చర్యలు తీసుకోలేదు.

- జి.విశ్వేశ్వరరావు, తిరుమలనగర్ అసోసియేషన్ కార్యదర్శి

● **సమాధానం:** ఆటోనగర్ ఈ బ్లాక్‌లో అనధికారంగా ఉన్న డంపింగ్ యార్డును వేరే ప్రాంతాలకు తరలించాలని ఐలా అధికారులకు సూచిస్తాం. వారు త్వరితగతిన చర్యలు తీసుకోకుంటే జీవీఎంసీ తరఫున చర్యలు చేపడతాం ఏపీఐఐసీ అధికారులతో మరో మారు మాట్లాడుతాం

- కిరణ్‌కుమార్, ఏఎంవో, జీవీఎంసీ



● **సమస్య:** తిరుమలనగర్‌కు ఆనుకొని ఉన్న పరిశ్రమలు వ్యర్థాలను కాల్చడంతో పెద్దఎత్తున పొగ అలముకుని శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. సాయంత్రం వేళ సమస్య పెరుగుతోంది. చిన్న పిల్లలను బయటకు పంపలేకపోతున్నాం. ఈ ప్రాంతం డంపింగ్ యార్డ్‌లా మారింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ శాశ్వత పరిష్కారం లభించడం లేదు.

- స్వాతి, తిరుమలనగర్

● **సమాధానం:** కాలుష్య సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాం. డంపింగ్ యార్డ్ సమస్యను ఇప్పటికే ఏపీఐఐసీ ఐలా దృష్టికి తీసుకెళ్లాం. గతంలో జీవీఎంసీ కమిషనర్, ఎమ్మెల్యేలతో కలిసి ఈ ప్రాంతంలో పర్యటించి, సమస్యను గుర్తించాం. త్వరలోనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- కిరణ్‌కుమార్, ఏఎంహెచ్‌వో జీవీఎంసీ



● **సమస్య:** ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఓ బస్సు నడిచేది. తరువాత ఆపేశారు. ఆటోలను ఆశ్రయిస్తే సమయంతో పాటు అదనపు ఖర్చవుతోంది. వడ్లపూడి బస్టాప్‌లో అన్ని బస్సులు ఆపేలా చర్యలు తీసుకోవాలి.

- దేవి, తిరుమలనగర్



● **సమాధానం:** ఈ మార్గంలో రెండు రోజుల్లో ఆర్టీసీ బస్సును అందుబాటులోకి తెస్తాం. వడ్లపూడి జంక్షన్‌లో అన్ని సర్వీసులు ఆగేలా డ్రైవర్లకు ఆదేశాలిస్తాం. ఇతర డిపోల బస్సులు కూడా ఆపాలని సూచిస్తాం. ప్రజలకు మెరుగైన రవాణా సేవలందిస్తాం.

- కృపారావు, ఆర్టీసీ అధికారి



● **సమస్య:** పాఠశాల ప్రాంగణంలో ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంది. రాత్రి సమయాల్లో మత్తు పదార్థాలు సేవిస్తున్నారు. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అడిగితే దురుసుగా ప్రవర్తిస్తున్నారు. పోలీస్ గస్తీ పెంచాలి.

- ద్రోణాద్రి అప్పలనాయుడు, దుగ్గపువానిపాలెం



● **సమాధానం:** ప్రతి ప్రాంతంలో గస్తీ పెంచుతాం. ఆకతాయిలు పాఠశాల ఆవరణలోకి వస్తే సమాచారం ఇవ్వండి. మా సిబ్బంది వారిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇస్తారు. ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ అసోసియేషన్‌లు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవా

- మల్లేశ్వరరావు, దువ్వాడ సీఐ



'అక్షరం అండగా... సమస్యల పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

నౌకా విశేషాలపై హార్బర్‌లో ఓపెన్ హౌస్



ఓపెన్‌హౌస్‌కు భారీ సంఖ్యలో హాజరైన వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు

మహారాణిపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నౌకా విశేషాలను సందర్శకులు, విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఒక్కరోజు ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని మత్స్యశాఖ మంగళవారం ఏర్పాటు చేసింది. భారత మత్స్య పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో ఫిషింగ్ హార్బర్ జెట్టీలో మత్స్యషికారి, మత్స్యదర్శిని పేరు గల నౌకలో ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఫిషరీస్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ కె.ఆర్.శ్రీనాథ్ ప్రారంభించారు. నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, సందర్శకులను నౌకలోకి అనుమతించి అందులోని విశేషాలు తెలియజేశారు. నేవిగేషన్ పరికరాలు, సముద్ర జలాల్లో లభ్యమయ్యే వివిధ రకాల చేపలు పట్టే వలలు, పరిశోధనకు ఉపయోగపడే అరుదైన మత్స్యరాశులు, ప్రమాదం జరిగినప్పుడు ఉపకరించే రక్షణ పరికరాలు, సమాచార సాధనాలు తదితర వాటిని సందర్శకులకు చూపించి, వాటి ఉపయోగాన్ని విద్యార్థులు పరిశీలించారు. మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు నంబూరులో తాత్కాలిక హాల్ట్

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పరిధిలో బైబిల్ మిషన్ కార్యక్రమాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ మీదుగా భువనేశ్వర్, సికింద్రాబాద్ మధ్య రాకపోకలు సాగిస్తున్న విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు (17015/17016) నంబూరు స్టేషన్‌లో తాత్కాలిక హాల్ట్ కల్పిస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. భువనేశ్వర్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17015) ఈ నెల 29న అర్ధరాత్రి 12.30 గంటలకు, తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్ నుంచి భువనేశ్వర్ వెళ్లే విశాఖ ఎక్స్‌ప్రెస్ (17016) ఈ నెల 29న రాత్రి 9.50 గంటలకు నంబూరు స్టేషన్‌కు చేరుతాయని పేర్కొన్నారు.

ఐటీఐ అభ్యర్థులకు బ్రిడ్జికోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కోర్సుల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశాలకు ఐటీఐ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులుకు బ్రిడ్జి కోర్సులు నిర్వహిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ పేర్కొన్నారు. ప్రవేశాల వివరాలను వెల్లడించారు. రెండేళ్ల వ్యవధి గల ఐటీఐ పూర్తిచేసిన అభ్యర్థులు సంబంధిత డిప్లొమా కోర్సుల్లో చేరవచ్చన్నారు. ఐటీఐలో 60% మార్కులు సాధించిన విద్యార్థులు ఐటీఐ, పదో తరగతి ధ్రువపత్రాలతో దరఖాస్తులను కంచరపాలెం పాత ప్రభుత్వ ఐటీఐలో అందజేయాలన్నారు. అభ్యర్థులకు ఫిబ్రవరి 21 వరకు శిక్షణ ఇస్తామన్నారు. దరఖాస్తుకు జనవరి 31 వరకు గడువు ఉంది. వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్ సీహెచ్.లలిత కుమారిని సంప్రదించాలని కోరారు.

నేడు అప్పన్న నౌకా విహారోత్సవం

» ట్రయల్‌రన్ విజయవంతం » సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న దర్శనాలు



పుష్కరిణిలో ట్రయల్‌రన్ నిర్వహిస్తున్న దృశ్యం

సింహాచలం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక ఉత్సవాల్లో భాగంగా నౌకా విహారోత్సవం (తెప్పోత్సవం) ఈ నెల 29న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు పూర్తి చేశారు. పుష్యమాస బహుళపక్ష అమావాస్య రోజు తెప్పోత్సవం నిర్వహించడం ఆచారం. సాయంత్రం ఆరు గంటలకు తెప్పోత్సవం ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో సింహగిరిపై భక్తులకు అప్పన్న దర్శనాలు సాయంత్రం ఆరు గంటల వరకు మాత్రమే ఉంటాయని ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వేండ్ర త్రినాథరావు ఆదేశాల మేరకు కార్యనిర్వాహక ఇంజనీర్ పర్యవేక్షణలో రెండు రోజులుగా కొండ దిగువ వరాహ పుష్కరిణిలో విస్తృత ఏర్పాట్లు చేశారు. మత్స్యశాఖ అధికారుల సూచనలతో హంసాకృతిలో నౌకను పలు రకాల పుష్పాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి మజ్జి ఆశాజ్యోతి సారథ్యంలో మంగళవారం సాయంత్రం 25 మందితో నీటిలో ప్రయాణించి నౌక సామర్థ్యాన్ని పరీక్షించి ట్రయల్ రన్ వేశారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా 15మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు. పుష్కరిణికి చుట్టుప్రక్కలా రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. సుమారు 40 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు గోపాలపట్నం సీఐ జి.అప్పారావు తెలిపారు.

ప్రేమ పేరుతో నయవంచన

» బాలికకు గర్భవతిని చేసిన యువకుడు » కేసు నమోదు

మల్కాపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి మోసగించిన యువకుడిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. ఒడిశా కటక్ ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలికతో కలిసి ఆమె తండ్రి ఉపాధి నిమిత్తం విశాఖ వచ్చారు. ఇక్కడికి వచ్చిన తరువాత వారి మధ్య మనస్పర్థలు రావడంతో బాలికను వదిలేశారు. అప్పటినుంచి బాలిక గాజువాకలో పనిచేసుకుంటూ శ్రీహరిపురంలో తండ్రి ఇంటికి అప్పుడప్పుడు వస్తుండేది. ఈ క్రమంలో యశ్వంత్(22)తో పరిచయమైంది. అతడు ప్రేమిస్తున్నట్టు నమ్మించి శారీరకంగా దగ్గరయ్యాడు. దీంతో బాలిక గర్భం దాల్చింది. ఆరోగ్యం బాగా లేకపోవడంతో కేజీహెచ్‌కు వెళ్లగా వైద్యులు పరీక్షించి ఆమె గర్భవతిగా తేల్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. యశ్వంత్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు నిందితుడు పరారీలో ఉన్నాడని తెలిపారు.

ఉక్కు ఉద్యోగులకు 30 శాతమే నవంబరు జీతాలు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు నవంబరు నెలకు సంబంధించి 30 శాతం జీతాన్ని మంగళవారం యాజమాన్యం చెల్లించింది. సెప్టెంబరు 50 శాతం, అక్టోబరు 30, నవంబరు 35, డిసెంబరు 100 శాతం వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరు నెలలుగా జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి వచ్చిందని ఉద్యోగులు వాపోతున్నారు.

పాత నేరస్థుడి అరెస్టు

ఎంవీపీ కాలనీ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెదవాల్తేరు శివాలయంలో జరిగిన చోరీ కేసులో పాత నేరస్థుడిని అరెస్టు చేసినట్టు ద్వారకా జోన్ ఏసీపీ వెంకటరావు తెలిపారు.సీసీటీవీ పరిశీలనలో నేరస్థుడి చేతిపై ఉన్న టాటూ ఆధారంగా డి.హరికృష్ణగా గుర్తించారు. సీఐ చక్రధరరావు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు రామకృష్ణ, సాయి, జగత్ కిరణ్ నిందితుడిని పట్టుకున్నారన్నారు.

సామాన్యులకు పర్యావరణ చట్టాలు తెలియాలి

విశాఖపట్నం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సామాన్యులకు పర్యావరణ చట్టాలపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి వెంకటశేషమ్మ అన్నారు. జీవీఎంసీ, జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన వర్క్‌షాపులో భావితరాలకు స్థిరమైన పర్యావరణం కోసం పనిచేయాలని , ఇందుకు వాటాదారులు భాగస్వాములు కావాలని సూచించారు. పర్యావరణవేత్త, కృష్ణా వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య సుంకర రామకృష్ణారావు మాట్లాడుతూ నగరంలో సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ నిషేధించినందున ప్రతి ఒక్కరు గుడ్డ సంచులు ఉపయోగించాలని కోరారు. వర్క్‌షాపులో ఏయూ పర్యావరణ విభాగం విశ్రాంత ఆచార్యుడు ఉదయభాస్కరరెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి మాజీ ఉన్నతాధికారి కె.శ్రీరామమూర్తి, ఈఈ పీ.శ్రీనివాసరావు ఇతర అధికారులు, పలు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు.